
పీహెచ్‌సీలకు జాతీయ అవార్డులు
6 లో



జిల్లా జనాభా : 29 లక్షలు | మండలాలు : 38 | గ్రామ పంచాయతీలు : 722 | విస్తీర్ణం : 13,076 చ.కి.మీ | అగ్నిమాపక కేంద్రాలు : 9 | అగ్నిమాపక యంత్రాలు : 10 | మిస్ట్ వెహికల్స్ : 1 | మిస్ట్ బుల్లెట్స్ : 4



ఈ ఇనుప రేకు తలుపే కేంద్రానికి రక్ష

ఉదయగిరి అగ్నిమాపక కేంద్రం సమస్యల్లో చిక్కుకుంది. 167-బీజీ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా అగ్నిమాపక కేంద్రానికి చెందిన 60 సెంట్ల స్థలాన్ని కోల్పోయి భద్రత లేకుండా పోయింది. కేంద్రం చుట్టూ ప్రహారీ లేకపోవడంతో మూగజీవాలు, వన్యప్రాణులు, విషపురుగులు తిరుగుతుండటంతో సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. దీనికితోడు సరైన వసతులులేక అవస్థలు పడుతున్నారు. ఇక కేంద్రంలో 9 మంది సిబ్బందికి నలుగురు మాత్రమే ఉన్నారు.

\- ఉదయగిరి

● అగ్గిరేగితే బుగ్గిపాలేనా!?

మండేకాలం

- జిల్లాలో అగ్నిమాపక కేంద్రాల కొరత
- సిబ్బంది చాలక ఉన్నవారిపైనే భారం
- వైసీపీ హయాంలో ప్రతిపాదనలన్నీ బుట్టదాఖలు
- కూటమి ప్రభుత్వంలో చిగురిస్తున్న ఆశలు
- ఆత్మకూరు, బుచ్చి స్టేషన్లకు రూ.2 కోట్లు మంజూరు

జిల్లాకు విసిరేసినట్టు ఉన్న కొండాపురంలో ఏదైనా అగ్ని ప్రమాదం జరిగితే బూడిద కావాల్సిందే. వింజమూరు ఫైర్‌స్టేషన్ నుంచి కొండాపురానికి 30 కి.మీ దూరం. ఇక కావలి నుంచి 40 కి.మీ దూరం వస్తుంది. ఈ రెండు ప్రాంతాల నుంచి అగ్నిమాపక యంత్రం ఘటనా స్థలికి చేరుకునేలోపు సుమారు 40 నిమిషాల నుంచి ఓ గంట సమయం పడుతుంది. ఈలోపు అగ్నికీలల్లో ఆస్తి బుగ్గి కావాల్సిందే.



అగ్నిమాపక శాఖలో ఈ వాహనం పేరు మిస్ట్ వెహికల్. వీవీఐపీలు, వీఐపీల కాన్వాయ్‌లో ఈ వాహనం తప్పనిసరిగా ఉండాలి. అంత ముఖ్యమైన వాహనం మరమ్మతుకు గురై ఇదిగో ఇలా నెల్లూరులోని అగ్నిమాపక స్టేషన్‌లో ఓ మూలకు చేరింది. శుక్రవారం నుంచి పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు పర్యటన సందర్భంగా కాన్వాయ్ కోసం ఒంగోలు నుంచి మిస్ట్ వెహికల్‌ను తెప్పించాల్సి వచ్చింది. ఈ నెల 15వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కందుకూరుకు రానున్నారు. మరి అక్కడి కాన్వాయ్ కోసం అగ్నిమాపక యంత్రాన్ని ఎక్కడ నుంచి తెప్పించాలో అర్థంకాక ఆ శాఖ అధికారుల్లో మధనపడుతున్నారు.



నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వేసవి రాకముందే ఎండలు మండిపోతున్నాయి. రాత్రిపూట మంచుతో కూడిన చలిగాలులు వీస్తున్నా పగలు మాత్రం ఉష్ణోగ్రతలు ఠారెత్తిస్తున్నాయి. సాధారణంగా ఎండాకాలం వచ్చిందంటే నగరం, పట్టణం, పల్లె ఏ ప్రాంతం అని కాకుండా అగ్ని ప్రమాదాలు నిత్యం జరుగుతూనే ఉంటాయి. జిల్లాలో 23 లక్షలకుపైగా జనాభా ఉంటే అగ్నిమాపక కేంద్రాలు మాత్రం తొమ్మిదే ఉన్నాయి. ఈ కేంద్రాల్లోనూ కేవలం పది అగ్నిమాపక యంత్రాలు ఉన్నాయి. జిల్లాలో ఫైర్ స్టేషన్ల సంఖ్య పెంచాలని ఎప్పటి నుంచో కోరుతున్నా పాలకులు స్పందించడం లేదు. మండలానికొక ఫైర్ ఇంజన్ కూడా లేకపోవడంతో ఫైర్ స్టేషన్లు ఉన్న పరిసర ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటే మాత్రమే వాటిని అగ్నిమాపక దళం నివారించగలుగుతోంది. దూర ప్రాంతంలో అగ్గి రేగితే బుగ్గి కావాల్సిందే. మరోవైపు జిల్లాలోని ఉన్న 10 అగ్నిమాపక యంత్రాలలో కొన్ని పూర్తి స్థాయిలో ఫిట్‌నెస్‌లో లేకపోవడంతో తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. జిల్లాలో ఉన్న ఒకే ఒక్క మిస్ట్ వెహికల్ ప్రస్తుతం మరమ్మతులకు గురైంది.

● ఫైర్ స్టేషన్ల కోసం దురుచూపు

జిల్లాలో ఏళ్ల తరబడి కొత్త ఫైర్ స్టేషన్ల కోసం ప్రజలు ఎదురు చూస్తూనే ఉన్నారు. మండలానికి ఒక ఫైర్ స్టేషన్ కావాలన్నది ప్రజల ఆకాంక్ష. దీనికి అనుగుణంగా ప్రభుత్వాలు మారినప్పుడల్లా జిల్లాలో కొత్త స్టేషన్లు కావాలని అధికారులు సిఫారసు చేస్తూనే ఉన్నారు. ప్రస్తుతం నెల్లూరు, ఆత్మకూరు, కావలి, ఉదయగిరి, వింజమూరు, పొదలకూరు, రాపూరు, మర్రిపాడు, కందుకూరులలో మాత్రమే స్టేషన్లు ఉన్నాయి. వెంకటాచలం, నెల్లూరు రూరల్, సైదాపురం, బుచ్చి, సర్వేపల్లి, అల్లూరు, ఇందుకూరుపేట తదితర ప్రాంతాల్లో స్టేషన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ఎప్పటినుంచో సిఫారసులు వెళుతున్నాయి. కానీ అవన్నీ కాగితాల్లోనే ఉండిపోతున్నాయి. దీంతో జిల్లాలో మారుమూల ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించిన సమయంలో భారీగా ప్రాణ, ఆస్తి నష్టం అదుపు చేసేందుకు అవకాశం లేకుండా పోతోంది.

సమాచారం ఇవ్వవలసిన ఫోన్ నెంబర్లు

నెల్లూరు	0861 2331051	9963734284
కావలి	08626 243101	9963734286
ఆత్మకూరు	08627 221222	9963734394
పొదలకూరు	08621 225202	9963734828
రాపూరు	08621 226145	9963735094
ఉదయగిరి	08620 229251	9963735314
వింజమూరు	08629 214437	9963735446
మర్రిపాడు	08620 228800	9963744817
కందుకూరు	05898 223399	9963733252
టోల్ ఫ్రీ నెంబరు	101	

● వెంటాడుతున్న సిబ్బంది కొరత

జిల్లాలో 9 ఫైర్ స్టేషన్ల పరిధిలో 95 మంది ఫైర్‌మెన్‌లు, 15 మంది డీవోపీలు, 27మంది లీడింగ్ ఫైర్‌మెన్‌లు, ఆరుగురు ఎస్ఎఫ్‌ఓలు, 40 మంది డ్రైవర్లు, ఆపరేటర్లు, హోంగార్డులు ఉన్నారు. మొత్తం 183 మంది ఉన్నారు. ఇంకా 50 పోస్టులకు పైగా ఖాళీలు ఉన్నట్లు తెలుస్తోంది. భారీ అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు సిబ్బంది కొరతతో మంటలను అదుపు చేయడం కష్టతరంగా మారుతోంది. ఉన్నవారిపైనే పనిభారం పడుతోంది.

● రూ.2 కోట్లు మంజూరు

జిల్లాలో గత వైసీపీ హయాంలో నెల్లూరు రూరల్, బుచ్చిరెడ్డిపాలెం, వెంకటాచలం ప్రాంతాల్లో స్టేషన్లు ఏర్పాటు చేయాలని పలుమార్లు సిఫారసులు వెళ్లాయి. కానీ పట్టించుకున్న దాఖలాలులేవు. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బుచ్చి ఫైర్ స్టేషన్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతోపాటు, స్థలాన్ని కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి కేటాయించారు. ఇక అగ్నిమాపక శాఖ డీజీ నుంచి అనుమతులు రావాల్సి ఉంది. ఆత్మకూరు, పొదలకూరులో ఫైర్ స్టేషన్ల నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం ఇటీవల నిధులు మంజూరు చేసింది. విపత్తుల నిర్వహణ కింద అగ్నిమాపక శాఖకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొదటి ఫేస్ కింద వారం రోజుల కిందట రూ.75 కోట్లు కేటాయించారు. అయితే, బుచ్చి, ఆత్మకూరులలో స్టేషన్ల నిర్మాణానికి సుమారు రూ.2 కోట్లు ఇటీవల మంజూరయ్యాయి. ఈ క్రమంలో జిల్లాకు సంబంధించి నూతన స్టేషన్ల ఏర్పాటు, వాహనాల కొనుగోలు, పరికరాలకు ఎంత ఖర్చు చేయాలన్న దానిపై డీజీ మాదిరెడ్డి ప్రతాప్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.



రెండు హృదయాల కలయికే ప్రేమ

ప్రేమ.. ఓ అద్భుతం, ఓ నమ్మకం, ఓ ఆరాధన ఇలా చెప్పుకుంటూపోతే చాలా నిర్వచనాలే ఉన్నాయి. రెండు గుండె చప్పుళ్లను ఏకం చేసే ప్రేమ ఎలా పుడుతుందో ఎవరికీ అంతుపట్టదు. ఆకర్షణపై కన్నా అర్థం చేసుకునే పునాదులపై ఏర్పడిన ప్రేమ కలకాలం నిలబడుతుంది. అది నిస్వార్థమైన త్యాగానికి ఆలవాలంగా నిలుస్తుంది. ఎన్నటికీ తరగని ప్రేమను తన హృదయంలో శాశ్వతంగా నిలుపుకుంటుంది. ప్రేమదాసులు దేవదాసులైనా.. పెళ్లి తర్వాత ప్రేమలు ఫెయిల్యూర్ అయినా.. అసలైన ప్రేమ మాత్రం అజరామరంగా నిలిచి వెలుగుతుంది. ఈ రోజు ప్రేమికుల దినోత్సవం. ప్రాణం తీసే ప్రేమలు కాదు.. ప్రాణం పోసే ప్రేమలు వర్ధిల్లాలని మనసారా కోరుకుందాం.

- వివరాలు 6లో

'ఈ-పంట' నమోదే ప్రామాణికం

- ఈకేవైసీ కూడా తప్పనిసరి
- ఇప్పటికి 95 శాతం ఈ-పంట, 57 శాతం ఈకేవైసీ నమోదు
- నెలాఖరు వరకు అవకాశం

- వివరాలు 6లో

సీఎం పర్యటన

షెడ్యూలు ఖరారు

కందుకూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 15వ తేదీన పర్యటన ఖరారయ్యింది. శనివారం ఉదయం 11 గంటలకు ఉండవల్లిలోని తన నివాసం నుంచి చంద్రబాబు హెలికాప్టర్‌లో బయలుదేరి 11.45 గంటలకు కందుకూరులోని టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన హెలిపాడ్‌కు చేరుకుంటారు. ఆ తర్వాత 12.05 గంటలకు పట్టణంలోని దూబగుంట సమీపంలో ఏర్పాటు చేస్తున్న ఎంఆర్ఎఫ్ ఫెసిలిటీ సెంటర్‌కు (వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్)కు చేరుకుంటారు. అక్కడ మిషనరీని ప్రారంభిస్తారు.

● దూబగుంటలో స్వచ్ఛాంధ్ర

స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా దూబగుంట గ్రామంలో వీధులు, డ్రైనేజీలు శుభ్రం చేసే కార్యక్రమంలో సీఎం పాల్గొంటారు. ఈ సందర్భంగా పారిశుధ్యం ప్రాముఖ్యతపై గ్రామస్థులతో చంద్రబాబు ముఖాముఖి మాట్లాడతారు. ఎంపిక చేసిన మూడు గృహాలలో ఇంకుడుగుంతలను ప్రారంభిస్తారు. అనంతరం పార్కు కమ్ పాండ్‌ను సందర్శిస్తారు. మధ్యాహ్నం 12.50 గంటలకు వ్యవసాయ మార్కెట్ యార్డుకు చేరుకుంటారు. 1.30 గంటల వరకు విశ్రాంతి తీసుకుని సభావేదికకు చేరుకుంటారు. బహిరంగ సభలో మాట్లాడటంతోపాటు మున్సిపాలిటీలోని ప్రజలతో ముఖాముఖి మాట్లాడతారు. అనంతరం హెలిపాడ్‌కు చేరుకుని ఉండవల్లిలోని తన నివాసానికి చంద్రబాబు బయలుదేరి వెళతారు.

● ఏర్పాట్ల పరిశీలన

సీఎం పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను గురువారం కలెక్టరు ఓ. ఆనంద్ ఎస్పీ కృష్ణకాంత్, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయా ప్రాంతాలలో చేపట్టాల్సిన చర్యలపై సబ్ కలెక్టరు శ్రీపూజ, మున్సిపల్ కమిషనర్ కె. అనూషలకు పలు సూచనలు చేశారు.



వ్యవసాయ మార్కెట్ యార్డులో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టరు ఆనంద్, పక్కన ఎస్పీ, ఎమ్మెల్యే

వసతి గృహాలకు మరమ్మతులు

సంక్షేమ హాస్టళ్లకు మంచిరోజులు

- వసతుల కల్పనకు రూ.9.32 కోట్లు మంజూరు
- తొలి విడతలో 34 హాస్టళ్లకు మరమ్మతులు

నెల్లూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు విద్యాలయాలైన సంక్షేమ హాస్టళ్లు కనీస నిర్వహణ లేక కునారిల్లుతున్నాయి. ఎప్పుడు పెచ్చులూడి మీద పడతాయో.. ఏవైపు నుంచి పాములొచ్చి కాటు వేస్తాయోనన్న భయంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ హాస్టళ్లలో గడుపుతున్నారు. ఆఖరుకు చాలా చోట్ల మరుగుదొడ్లు కూడా లేవు. ఈ వసతి గృహాల్లో చేరుతున్న విద్యార్థుల సంఖ్య ఏటా తగ్గిపోతూ వస్తుండటమే ఇందుకు నిదర్శనం. ఈ పరిస్థితిని గమనించిన కూటమి ప్రభుత్వం జిల్లాలోని సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లను బాగు చేయాలని నిర్ణయించింది. అవసరమైన మరమ్మతులు చేయడంతో పాటు వసతులు కల్పించేందుకు నిధులు మంజూరు చేసింది. జిల్లాలో 71 హాస్టళ్లు ఉండగా వీటిని బాగు చేసేందుకు రూ.9.32 కోట్లు కేటాయించింది. తొలి విడతగా 34 హాస్టళ్లను రూ.5.52 కోట్లతో మరమ్మతులు చేసేందుకు కలెక్టర్ ఆనంద్ పరిపాలనా అనుమతులు మంజూరు చేశారు. చేజర్ల, ఆత్మకూరు, సంగం, మర్రిపాడు, నెల్లూరు రూరల్, నెల్లూరు అర్బన్, పొదలకూరు, వెంకటాచలం, మనుబోలు, రాపూరు, కలువాయి మండలాల్లోని వసతి గృహాలు ఈ జాబితాలో ఉన్నాయి. వసతి గృహాల్లో తాగునీటి వసతి కల్పించేందుకు ప్రాధాన్యతను ఇస్తున్నారు. అలానే టాయిలెట్‌ను బాగు చేయడం, పెచ్చులూడుతుంటే కొత్తగా ప్లాస్టింగ్ వేయడం, ఫ్లోరింగ్ బాగు చేయడం, ప్రహరీ గోడలు నిర్మించడం, తలుపులు, కిటికీలు కొత్తవి ఏర్పాటు చేయడం వంటి పనులు తాజా నిధులతో చేపడుతున్నారు. దోమలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో దోమల సమస్య తీర్చేందుకు ఫ్యాన్లు బాగు చేయడంతోపాటు దోమతెరలు కూడా ఏర్పాటు చేయనున్నారు. అలానే ఈ హాస్టళ్లలో ఇతర అవసరాలు ఏవి ఉన్నా వెంటనే చేసేలా కలెక్టర్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ పనులు చేసేందుకు పంచాయతీరాజ్ శాఖ ప్రస్తుతం టెండర్లు ఆహ్వానించింది. ఈ ప్రక్రియ పూర్తి కాగానే నెల రోజుల్లోపు పనులు పూర్తి చేసేలా అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. రెండో విడతలో మరికొన్ని హాస్టళ్లను బాగు చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. కాగా ప్రస్తుతం జిల్లాలోని సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో 4702 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వారిలో బాలురు 2489 మంది ఉండగా బాలికలు 2213 మంది ఉన్నారు.



మనుబోలు ఎస్సీ బాలుర వసతిగృహంలో పలుచోట్ల దెబ్బతిన్న శ్లాబు



ఇరిగేషన్ కార్యాలయం, డీఆర్‌డీఏ కార్యాలయం వెనుక పిచ్చి మొక్కలు

తహసీల్దారు కార్యాలయం పైన..

మొక్కే కదా అని వదిలేయకండలా..!

● ప్రభుత్వ భవనాల్లో చొచ్చుకొస్తున్న నిర్లక్ష్యం


ఈ చిత్రాలు గమనించారా!? ఇవెక్కడో పాడుబడిన భవనాలని అనుకుంటున్నారా!? అయితే మీరు పొరబడ్డారు. నిత్యం అధికారులు, ప్రజలు రాకపోకలతో సందడిగా ఉండే మన ప్రభుత్వ కార్యాలయాలు ఇవి. నిర్వహణలోపం కారణంగా ఇవిగో ఇలా రంగులు వెలసిపోయి కళావిహీనంగా మారిపోయాయి. అంతేకాదండోయ్... భవనాల గోడలపై మొలచిన మొక్కలు మానులైనా పట్టించుకున్న అధికారి లేదు. వీటిని ఇలాగే వదిలేస్తే భవనాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. ఇకనైనా అధికారులు స్పందించి మొక్కలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి




సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం..





పాత మున్సిపల్ సమావేశ మందిరం ప్రస్తుత సచివాలయం, కలెక్టరేట్ భవనం గోడలపై మొక్కలు



ఇంత పెద్దవయ్యేదాక వదిలేశారే..!



ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏపుగా..

పీహెచ్‌సీలకు జాతీయ అవార్డులు

● ప్రదానం చేసిన డీఎంహెచ్‌వో సుజాత



జాతీయ అవార్డులు అందుకున్న ఆరోగ్య కేంద్రాల నిర్వాహకులతో డీఎంహెచ్‌వో సుజాత, అధికారులు

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి జాతీయ నాణ్యతా ప్రమాణాల అవార్డులు లభించాయి. ఆ పురస్కారాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుజాత గురువారం ఆరోగ్య కేంద్రాల అధికారులకు అందించారు. రామతీర్థం, జొన్నవాడ పీహెచ్‌సీలతోపాటు వింజమూరు మండలం ఊటుకూరు, ముత్తుకూరు మండలం దొరువుల పాళెం, నెల్లూరు రూరల్ మండలం అమంచర్ల, పొదలకూరు మండలం మొగళ్లూరు విలేజ్ హెల్త్ సెంటర్(ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు)లకు ఈ అవార్డులను డీఎం హెచ్‌వో అందించారు. ఆమె మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలు పాటించే ఆసుపత్రులకు కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డు అందిస్తుందని చెప్పారు. జిల్లా లోని మిగిలిన పీహెచ్‌సీలు కూడా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ ఉమామహేశ్వరి, డీపీఎంవో డాక్టర్ రమేష్, హెచ్‌డబ్ల్యూసీ వైద్యాధికారి డాక్టర్ బ్రహ్మేశ్వరనాయుడు, డెమో కనకరత్నం, ఎంక్వాస్ క్వాలిటీ మేనేజర్ భరత్, అవార్డులు స్వీకరించిన వైద్యాధికారులు పాల్గొన్నారు.

పాతనేరస్థుల బైండోవర్

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రౌడీ, సస్పెక్ట్ షీటర్లు, పాతనేరస్థులను చిన్నబజారు పోలీసు స్టేషన్ పరిధిలో గురువారం బైండోవరు చేశారు. సీఏఎం స్కూలు ప్రాంగణంలో అనుమానాస్పదంగా ఉన్న డైకస్‌రోడ్డు చేపల మార్కెట్‌కు చెందిన రౌడీషీటర్ పీ తౌసీఫ్‌ఖాన్, పాత నేరస్థుడు పొదలకూరురోడ్డు లక్ష్మీనగర్‌కు చెందిన అబ్బూ సుఫియాన్‌ను చిన్నబజారు ఎస్‌ఐ అయ్యప్ప తన సిబ్బందితో అదుపులోకి తీసుకున్నారు. వారిని స్థానిక తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశారు.

ప్రేమ ఓ ప్రేమ!

ప్రేమ.. ప్యార్.. ఇష్క్.. లవ్.. మెహబ్బత్ ఇలా ఏ భాషలో చెప్పినా భావం ఒక్కటే. ప్రేమ కోసం కొందరు ప్రాణాలు అర్పిస్తే.. మరికొందరు పాలరాతి మందిరాలు నిర్మించారు. ఇంకొందరు గుండెనే గుడిగా మలిచి పూజించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా ప్రేమను గెలిపించుకున్నవారు కొందరైతే... ప్రేమలేని జీవితాన్ని ఊహించలేమంటూ ప్రాణాలు విడిచిన ప్రేమికులు మరికొందరు. ప్రేమ అనేది ఎప్పుడు ఎలా పుడుతుందో ఎవరూ చెప్పలేరు. ప్రేమికులు తమ ప్రేమను వ్యక్తం చేయడానికి సందర్భం ఎంచుకుంటారు. ప్రత్యేక సంఘటనలు, పుట్టినరోజు, వలంటైన్స్‌డే ఇలా ఏదో ఒక సందర్భాన్ని సద్వినియోగం చేసుకుంటారు. ఇందులో అధికశాతం మంది ప్రేమికుల రోజునే తమ ప్రేమను వ్యక్తం చేస్తుంటారు. అలాంటి రోజు రానే వచ్చింది. తమ మనసులో మాట చెప్పేందుకు ప్రేమికులు ఎదురు చూస్తున్నారు. ప్రేమను వ్యక్తం చేసేవారు.. ప్రేమలో ఉన్నవారు ఈ రోజు ఎప్పటికీ గుర్తుండిపోయేలా ప్లాన్ చేసుకుంటున్నారు. నేడు ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..



రెండు హృదయాల కలయిక

నేడు ప్రపంచ ప్రేమికుల దినోత్సవం

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) :ఖరీదైన కానుకలతో సర్‌ప్రైజ్ చేసుకునేందుకు ప్రేమికులు సన్నద్ధమయ్యారు. మదిలో ఉన్న ప్రేమ సందేశాలను ఇచ్చి పుచ్చుకునేందుకు మార్కెట్లో ఎన్నో వస్తువులు అందుబాటులోకి వచ్చేశాయి. ప్రేమికుల రోజు సందర్భంగా సరికొత్తగా సృజనాత్మకమైన వస్తువులెన్నో ప్రేమికులను ఆకట్టుకుం టున్నాయి. మా ప్రేమ చిరకాలం ఉండాలన్నా, తీపి గుర్తుగా మిగిలిపోవాలన్నా, మధుర జ్ఞాపకాలను ఫ్రేమ్‌లో బందించాలన్నా ఎన్నో గిఫ్టులు అందుబాటులో ఉన్నాయం టున్నారు ప్రేమికులు. వారు మెచ్చిన నచ్చిన ఫొటోలు ఫ్రేమ్‌లో బంధించి కానుకగా ఇవ్వడంతోపాటు లవర్స్ స్పెషల్ కీచైన్‌లు, టుడే అండ్ టుమారో, జస్ట్ ఫర్ యూ అనే హార్ట్ పిల్లోస్‌పై ఆసక్తి చూపుతున్నారు. అలాగే ప్రేమికుల కోసం ఎన్నో రకాల విదేశీ చాక్లెట్లు నోరూరిస్తున్నాయి. హార్ట్ షేప్‌లో ఉండే ఈ తీపిగుర్తులు ప్రత్యేక ప్యాక్‌లతో సిద్ధంగా ఉన్నాయి. ప్రేమను వ్యక్తం చేసేవారు టెడ్డీబేర్‌లు కొనుగోలు చేసేందుకు యువత మొగ్గు చూపుతోంది. గతంలో కంటే ఈసారి



వాలెంటైన్స్‌డేకి ప్రత్యేక గిఫ్టులు అందుబాటులో ఉన్నాయని, ప్రేమను తెలిపే విధంగా రకరకాల వస్తువులు సిద్ధంగా ఉంచామని వ్యాపారులు చెబుతున్నారు.

● ఆకర్షణ వలలో పడొద్దు..!

నేటి యువత ప్రేమ పేరుతో ఆకర్షణకు లోనై ఆలోచన, విచ క్షణా జ్ఞానం మరిచిపోతోంది. యవ్వనపు తొలిదశ కాస్త కవితాత్మకంగా మాట్లాడితే కరిగిపోతున్న ప్రేమికులకు కొదవలేదు. ఆకర్షణ ఉచ్చులో పడి వ్యక్తిత్వ లోపం కలిగిన వ్యక్తులను నమ్మి వంచనలకు గురవుతున్న యువ తులు ఎందరో ఉన్నారు. ప్రేమ, పెళ్లిళ్లపై స్పష్టమైన అవగాహన లేని వయస్సులోనే దాని వెంటపడి పరుగులు పెడుతూ కుటుంబాలకు ఆవేదన మిగిలుస్తున్న వారి సంఖ్య కూడా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. అలాగే తనకోసం ఏదీ ఆశించని పవిత్రమైన ప్రేమకు మాత్రమే విలువ ఇచ్చే వారు కూడా సమాజంలో ఉన్నారంటే అతిశయోక్తి కాదు. ఒకరికోసం ఒకరు త్యాగాలు చేసుకుంటూ, బలహీనతలను కూడా ప్రేమించగలిగి పెళ్లితో జీవితాన్ని శాశ్వతంగా ప్రేమమయం చేసుకున్న దంపతులు కూడా ఎందరో ఉన్నారు. బాయ్‌ఫ్రెండ్, గర్ల్‌ఫ్రెండ్ ఉండడం స్టేటస్ సింబల్ ఎంతమాత్రం కాదని తెలుసుకోవాలి. ప్రేమించడం వేరు.. ప్రేమిస్తున్నాననే భావన వేరు.. ఆకర్షణకు, ప్రేమకు మధ్య సున్నితమైన తేడాను గుర్తించాలి. ఆర్థిక స్థిరత్వం, వ్యక్తిత్వం లేని ప్రేమ ఎల్లకాలం నిలబడదు. జీవితంలో ప్రేమ ఒక భాగం మాత్రమే ప్రేమే జీవితం కాదు. ప్రేమ కోసం చావాలనుకోవడం, చంపాలనుకోవడం రెండూ నేరమే. ప్రేమకు మరణం ఉండదు. మరణానికి కారణం ప్రేమ కాకూడదు. హ్యాపీ వాలంటైన్స్ డే..

గుంతలు లేని రోడ్లే లక్ష్యం అని ఓ వైపు ప్రభుత్వం ప్రకటనలు చేస్తుంటే.. నెల్లూరులో మాత్రం గుంతలు పూడ్చడంలో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుంతలు పూడ్చేందుకు సుమారు రూ.20 కోట్ల వరకూ జిల్లాకు మంజూరు చేసింది. చాలా రోడ్లపై ఉన్న గుంతలు ఇప్పటికే పూడాయి. కానీ నెల్లూరు-పొదలకూరు రోడ్డుకు మాత్రం గుంతల నుంచి ఉపశమనం కలగడం లేదు.

ఇంకెన్నాళ్లీ కష్టాలు?

● పొదలకూరు రోడ్డు బాగుపడేదెప్పుడు!

● ఏడాది దాటినా అభివృద్ధికి నోచుకోని రహదారి

● గుంతల ప్రయాణంతో నిత్యం నరకం

నెల్లూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : సర్వేపల్లి, వెంకటగిరి నియోజకవర్గాలతోపాటు కడప జిల్లా నుంచి నెల్లూరుకు వచ్చేందుకు పొదలకూరు రోడ్డు ప్రధాన రహదారి. అటువంటి కీలకమైన రోడ్డు అభివృద్ధికి నోచుకోవడం లేదు. కొత్త రోడ్డు నిర్మాణం కోసం డీకేడబ్ల్యూ కాలేజీ నుంచి డైకస్ రోడ్డు సెంటర్ వరకూ (కి.మీ 0 నుంచి 5 వరకూ, కి.మీ 8 నుంచి 10 వరకూ) విస్తరించి నాలుగు వరుసల రోడ్డు వేయాలని అధికారులు ప్రతిపాదించారు. నాలుగేళ్ల క్రితం పశ్చిమ వైపు రోడ్డు బాగు చేసేందుకు నిధులు మంజూరయ్యాయి. అప్పుడు రోడ్డు వేసినా కొద్ది రోజులకే మళ్లీ దెబ్బతిన్నది. సైడు కాలువలు లేకుండా నిర్మిస్తున్నారని, దీని మూలంగా రోడ్డుపై నీళ్లు నిలబడి దెబ్బతినే ప్రమాదముందని నాడే 'ఆంధ్రజ్యోతి' హెచ్చరించినా అధికారులు పట్టించుకోలేదు. ఊహించిన విధంగానే వేసిన రోడ్డుతోపాటు తూర్పు వైపు ఉన్న రోడ్డు నీళ్లు నిలబడి మరింత గుంతలమయంగా మారింది. దీని మూలంగా అనేక ప్రమాదాలు కూడా జరిగాయి. అనేక విజ్ఞప్తుల తర్వాత తూర్పు వైపు రోడ్డును కూడా అభివృద్ధి చేసేందుకు 2023లో రూ.5.53 కోట్లు మంజూరయ్యాయి. అదే ఏడాది ఆర్‌అండ్‌బీ అధికారులు టెండర్లు పూర్తి చేసి, గతేడాది ఫిబ్రవరిలో కాంట్రాక్టర్ అగ్రిమెంటు కూడా చేసుకున్నారు. పశ్చిమ వైపు రోడ్డు వేసిన కాంట్రాక్టరే తూర్పు వైపు రోడ్డు వర్కును కూడా దక్కించుకున్నారు. 9 నెలల్లో పనులు పూర్తి చేయాల్సి ఉండగా, ఏడాది దాటినా ఇంతవరకూ నాలుగో వంతు పనులు కూడా పూర్తి కాలేదు. ప్రజల నుంచి ఆగ్రహం వ్యక్తవమవు తుండడంతో ఇటీవల డైకస్ రోడ్డు సెం టర్లో భారీ గుంతలు ఉన్నచోట సిమెంటు రోడ్డు వేసి వదిలేశారు. ఈ రోడ్డు పనులను ఐదు శాతం ఎక్సెస్‌కు దక్కించుకున్నారు. నాడు టెండర్ల సమయంలో వేరొకరు టెండర్లు వేయకుండా అడ్డుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే పనులు దక్కించుకున్న వేగంగా పనులు చేయకపోవడంతో ఇటు కాంట్రాక్టర్, అటు అధికారులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ఆర్‌అండ్‌బీ నెల్లూరు ఈఈ మురళీ కృష్ణను వివరణ కోరగా రెండు, మూడు రోజుల్లో పనులు మొదలు పెడతామని చెప్పారు. పనులు చేయడానికి అవసరమైన మెటీరియల్‌ను సమకూర్చుకోవాలని కాంట్రాక్టర్‌కు సూచించినట్లు పేర్కొన్నారు.



పొదలకూరు రోడ్డుపై ఏర్పడిన గుంతలు

పంట రుణాలపై వడ్డీ రాయితీ, పంట నష్ట పరిహారం అందించేందుకు, ధాన్యం కొనుగోలు వంటి పలు ప్రభుత్వ పథకాలు రైతుల దరి చేరాలంటే ఈ-పంట నమోదే ప్రామాణికం. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు రైతులకు పరిహారం అందేందుకు 'ఈ-పంట' ఎంతో ముఖ్యం. రబీ సీజన్‌కు సంబంధించి నెలాఖరు వరకు నమోదుకు సమయం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

'ఈ-పంట' నమోదే ప్రామాణికం



● ఈకేవైసీ కూడా తప్పనిసరి

● ఇప్పటికి 95 శాతం ఈ-పంట, 57 శాతం ఈకేవైసీ నమోదు

● నెలాఖరు వరకు అవకాశం

నెల్లూరు(వ్యవసాయం), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 3,33,378 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతున్నాయి. ఇప్పటికే 3,23,000 ఎకరాలకు ఈ-పంట నమోదు ప్రక్రియ పూర్తయింది. ప్రభుత్వ ఆదేశాలు మేరకు వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి రైతు కు ఎంత భూమి ఉంది?, ఏ పంట సాగు చేస్తున్నారు.. తదితర వివరాలు సేకరించారు. ఆధార్, మొబైల్ నెంబరు, సర్వే నెంబర్లతో పాటు రైతులు సాగుచేస్తున్న పంటల చిత్రాలు యాప్‌లో నమోదు చేశారు. సేకరించిన ధాన్యానికి దాదాపు 48గంటల్లోనే సొమ్ములు చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే.

● 57శాతం ఈకేవైసీ

జిల్లాలో ఈకేవైసీ నమోదు మాత్రం కాస్త మందకొడిగా సాగుతున్నట్లు కనిపి స్తోంది. ప్రస్తుతం నోటిఫైడ్ పంటలు సాగుచేస్తున్న రైతులకు మాత్రమే ఈకే వైసీ చేస్తున్నట్లు అధికారులు చెబుతు న్నారు. దాదాపు 67207 మంది రైతులకు గాను ఇప్పటి వరకు 38308 మందికి మాత్రమే అంటే 57శాతం మాత్రమే నమోదైంది. పీఎం కిసాన్ పథకం సొమ్ములు జమ కావాలంటే ఈకేవైసీ తప్పనిసరిగా చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలు జారీ చేశాయి. అనర్హులు లబ్ధిపొందుతున్నారనే సమాచారంతోనే తప్పనిసరిగా నమోదు చేయాలనే నిబంధన విధించాయని అధికారులు చెబుతున్నారు. దాదాపు ఏడాది కాలంగా ఈకేవైసీ నమోదుకు సమయం ఇస్తున్నా నూరుశాతం నమోదు కావడం లేదు. ఈ కారణంగా 20శాతం పైగా రైతులు పథకం లబ్ధి పొందలేక పోతున్నారు. ప్రస్తుతం దీనిపై అధికారులు అవగాహన కల్పిస్తూ నమోదు చేస్తున్నారు.



నూరుశాతం నమోదుకు కృషి చేస్తున్నాం



జిల్లాలో ఈ-పంట నమోదు 95శాతం వరకు పూర్త యింది. ఈకేవైసీ 57శాతం పైగానే నమోదైంది. అయితే ప్రస్తుతం ప్రతి రైతుకు ఆధార్ తరహాలో 12 అంకెల విశిష్ఠ సంఖ్య నమోదు కార్యక్రమంపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. దీంతో ఈకేవైసీ నమోదు వేగం తగ్గింది. నెలాఖరు వరకు సమయం ఉంది. గడువులోగా నూరు శాతం నమోదు చేసేందుకు కృషి చేస్తున్నాం.

- పీ సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

మొక్కలు పెంచుదాం

● నెల్లూరు - ఇచ్ఛాపురం సైకిల్ యాత్ర



చైతన్యను మొక్కను అందించి సైకిల్‌యాత్రను ప్రారంభిస్తున్న జేసీఐ నాయకులు సతీష్‌కుమార్, కోట సత్యనారాయణ, తదితరులు

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం ఆవశ్యకతపై ప్రచారం చేసేందుకు నెల్లూరుకు చెందిన యువ కుడు చైతన్య నగరం నుంచి ఇచ్ఛాపురం వరకు సైకిల్ యాత్ర చేపట్టారు. జేసీఐ నెల్లూరు, శుభమస్తు, ఫన్‌పార్క్, హైటెక్ ఫార్మా అభిషేక్ సంస్థలు ఈ యాత్రను ప్రోత్సహిం చాయి. గురువారం ఉదయం నగరంలోని మెడికవర్ ఆసుపత్రి వద్ద జేసీఐ మాజీ అధ్యక్షుడు సతీష్‌కుమార్, కోట సత్యనారాయణ, అభిషేక్, సాయి, కిషన్‌రామ్, జగన్, మల్లికార్జున్ జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. ఈ యాత్ర నెల్లూరు నుంచి ఇచ్ఛాపురం, తిరిగి ఇచ్ఛాపురం నుంచి నెల్లూరుకు సాగుతుందని, ఈ యాత్రలో మొక్కల పెంపకంపై ప్రచారం చేయడంతోపాటు అక్కడక్కడ మొక్కలు నాటుతారని జేసీఐ సభ్యులు తెలిపారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్లోని ధనలక్ష్మీపురం వద్ద ఉన్న ఓ ప్రైవేటు స్కూల్లో విద్యార్థిని ఆత్మహత్యకు యత్నించింది. స్థానికులు, రూరల్ పోలీసులు అందించిన సమాచారం మేరకు.. ఆ స్కూల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని గురువారం మూడవ అంతస్తు నుంచి కిందకు దూకింది. పాఠశాల సిబ్బంది హుటాహుటిన నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాలిక ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సమాచారం. పైనుంచి కిందకు దూకిన ప్రాంతంలో ఇసుక ఉండటం వల్ల ప్రమాదం తప్పినట్లు తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కాగా, ఇదే పాఠశాలలో రెండు నెలలు క్రితం ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన విషయం గమనార్హం.

ఆరేళ్ల బాలికపై లైంగిక దాడి

● వెంకటాచలంలో కేసు నమోదు

వెంకటాచలం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల మహిళలపై లైంగికదాడులు పెరిగిపోతున్నాయి. చిన్నా పెద్ద, వావివరసలు లేకుండా మృగాళ్లు రెచ్చిపోతున్నారు. పోక్సో చట్టం ఉన్నా అఘాయిత్యాలు మాత్రం తగ్గడం లేదు. వెంకటాచలం మండలంలో 15 రోజుల వ్యవధిలో మూడు లైంగికదాడి కేసులు నమోదు కావడం గమనార్హం. తాజాగా గూడ్లూరువారిపాళెం జడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న 15 ఏళ్ల బాలుడు అదే గ్రామంలో ఆరేళ్ల బాలికపై ఆదివారం లైంగికదాడికి ఒడిగట్టాడు. గురువారం ఈ విషయం వెలుగులోకి రావడంతో బాలిక తల్లి వెంకటాచలం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో సీఐ సుబ్బారావు, ఎస్‌ఐ అంజనేయులు గూడ్లూరువారిపాళెంలో విచారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, గూడ్లూరువారిపాళెం జడ్పీ హైస్కూల్‌లో గురువారం సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చట్టాలపైన అవగాహన కల్పించారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

ఉదయగిరి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జడ్పీ డిప్యూటీ సీఈవో జే.మోహన్‌రావు సిబ్బందికి సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ సర్వేలను నూరు శాతం సమగ్ర సమాచారంతో పూర్తిచేయాలన్నారు. వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.



చెక్‌పోస్టు ఏర్పాటుపై సిబ్బందికి సూచనలిస్తున్న పశుసంవర్ధకశాఖ జేడీ రమేష్‌నాయక్

బర్డ్‌ఫ్లూ భయమేమీ లేదు.. గుడ్లు, చికెన్ లాగించేయండి

- కోళ్ల లారీల తనిఖీకి చెక్‌పోస్టు
- పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ రమేష్‌నాయక్

మనుబోలు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బర్డ్‌ఫ్లూ భయమేమీ లేదని, నిర్భయంగా ఉడికించిన కోడిగుడ్లు, చికెన్‌ను తినవచ్చని జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ కే. రమేష్‌నాయక్ స్పష్టం చేశారు. స్థానిక పశు వైద్యశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బందితో మాట్లాడారు. అనంతరం బద్దెవోలు క్రాస్‌రోడ్డు వద్దకు చేరుకుని చెక్‌పోస్టు ఏర్పాటు, తనిఖీల గురించి అవగాహన కల్పించారు. తదుపరి జేడీ మాట్లా డుతూ జిల్లాలో 19 కోళ్ల ఫారాలు ఉన్నాయన్నారు. అన్నింటిలోనూ డాక్టర్లు తనిఖీలు చేసి నివేదికలు ఇచ్చారన్నారు. అంతేకాక ఫారమ్ నిర్వాహ కులకు జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించామన్నారు. ఉభయగోదావరి జిల్లాల్లో బర్డ్‌ఫ్లూ సమస్య వచ్చిందన్నారు. కావున ఎగువప్రాంతాల నుంచి వచ్చే కోళ్ల లారీలను తనిఖీలు చేసేందుకు ఉన్నతాధికారుల ఆదేశా లతో చెక్‌ పోస్టును ఏర్పాటు చేస్తున్నామన్నారు. యథావిధిగా కోడిగుడ్లు, చికెన్‌ను దుకాణదారులు అమ్మకోవచ్చన్నారు.100డిగ్రీల ఉష్ణోగ్రతలో చికెన్ ఉడకబెడితే సరిపోతుందన్నారు. 70డిగ్రీల తరువాత బర్డ్‌ఫ్లూ వైరస్ చనిపోతుందన్నారు. కావున ఎలాంటి ప్రమాదం లేదన్నారు. కార్యక్రమంలో ఎల్‌ఏ గౌతమి పాల్గొన్నారు.

ఏడువేల ఇంకుడు గుంతలు లక్ష్యం

- డ్వామా పీడీ గంగాభవాని



ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న డ్వామా పీడీ గంగాభవాని

మనుబోలు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏడువేల ఇంకుడు గుంతలు నిర్మించాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నామని జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) పీడీ గంగా భవాని తెలిపారు. స్థానిక అంబేడ్కర్ నగర్‌లోని చింతల వెంకటే శ్వర్లు ఇంట్లో నిర్మాణంలో ఉన్న ఇంకుడు గుంతను ఆమె గురువారం పరిశీలిం చారు. అనంతరం మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్రలో భాగంగా ఇంకుడు గుంతల నిర్మాణ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఒక్కో గుంత నిర్మా ణానికి ఉపాధిహామీ నుంచి రూ. 6వేలు ఇవ్వనున్నట్లు చెప్పారు. లబ్ధిదారుడి ఖాతాకే నేరుగా జమచేస్తామన్నారు. జిల్లా అంతటా ఇంకుడుగుంతల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఆమె అధికారులకు సూచించారు. ఉపాధిలో కూలీల సంఖ్యను పెంచి, వారికి రూ. 300వేతనం వచ్చేలాగా సిబ్బంది చర్యలు తీసుకో వాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో రాజమ్మ, టిఏ సుప్రజ, ఎఫ్ఏ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన తొలివిడత ప్రాక్టికల్స్

- రేపటి నుంచి రెండో విడత..



ప్రయోగ పరీక్షల తీరును పరిశీలిస్తున్న ఆర్ఐవో శ్రీనివాసులు

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ద్వితీయ సంవత్సరం సైన్స్ విద్యార్థులకు జరుగుతున్న ప్రాక్టికల్ పరీక్షలు తొలివిడత గురువారంతో ముగిశాయి. చివరి రోజు 5,679 మంది విద్యా ర్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఉదయం సెషన్‌లో 2,865 మందికి 2,831 మంది హాజరు కాగా 34 మంది గైర్హాజరయ్యారు. మధ్నాహ్నం 2,936 మందికి 2,848 మంది హాజరుకాగా 88 మంది గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో తొలివిడతలో నాలుగు రోజులు ప్రాక్టికల్స్ ప్రశాంతంగా జరిగాయన్నారు. గురువారం 8 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. అలాగే డీవీఈవో 7 కేంద్రాలను, డీఈసీ సభ్యులు, ఫ్లైయింగ్‌స్క్వాడ్ కలిపి 13 సెంటర్లను పరిశీలించారు. కాగా, రెండో విడత ప్రయోగ పరీక్షలు శనివారం నుంచి జరగనున్నాయి.

డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షలకు ఇద్దరు గైర్హాజరు

వెంకటాచలం, ఫిబ్రవరి 13 (ఆంధ్ర జ్యోతి) : వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో గురువారం జరిగిన డిగ్రీ మొదటి, నాలుగవ సెమిస్టర్ల సప్లిమెంటరీ పరీక్షలకు ఇద్దరు విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ సీహెచ్ వెంకట్రా యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 24 మందికిగానూ 22 మంది హాజరయ్యారు.

16న జిల్లాస్థాయి యోగా పోటీలు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా యోగా క్రీడా అసోసి యేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16న నెల్లూరులోని ఓవెల్ విద్యాసంస్థలో జిల్లాస్థాయి యోగా పోటీలు నిర్వహి స్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు నిర్మల నరసింహారెడ్డి తెలిపారు. ఈ పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను గురువారం సంఘం కార్యాలయంలో ఆవిష్కరించారు. 4, 5 తరగతుల విద్యార్థులకు సబ్‌జూనియర్, 6, 7 తరగతులకు జూనియర్, 8, 9 తరగతులకు సీనియర్ విభాగాలుగా పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. విజేతలకు బహుమతులు అందజేసి జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ప్రసన్నకుమార్, ఓవెల్ జీఎం మహదేవ నాయుడు, ట్రస్ట్ సభ్యులు హేమంత్ కుమార్‌రెడ్డి, ప్రవల్లికారెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-ప్రొక్యూర్మెంట్ పోర్టల్‌పై శిక్షణ

నెల్లూరు (హరనాథపురం), (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ధాన్యం కొనుగోలు, ప్రమా ణాలు తదితర అంశాలపై గురువారం జడ్పీ సమావేశ మందిరంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. టీసీఎస్ పర్సన్ మహేష్ ఆన్‌లైన్ పోర్టల్ గురించి వివరించారు. జిల్లాలో 300 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం సేకరించాలని అధికారులు నిర్ణయించడం తో ఈ శిక్షణకు ప్రాధాన్యత ఏర్పడింది. త్వరలో కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ ఏఎం (టెక్నికల్) లక్ష్మీ నారాయణ, డీఎస్‌వో అంకయ్య, డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.

మర పక్షి ఆకాశ గస్తీ !



- నెల్లూరు నగరంలో డ్రోన్లతో నిఘా
- నేరాల కట్టడికి ఆకాశంలో మూడో కన్ను
- పలు ప్రాంతాల్లో ఏరియల్ తనిఖీ
- ఓపెన్ డ్రింకింగ్‌పై 48 కేసులు
- పేకాట స్థావరాలూ గుర్తింపు



నిరంతరం పర్యవేక్షణ

- సింధుప్రియ, సిటీ డీఎస్పీ

నేరాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న ఏరియాలపై డ్రోన్ కెమెరాలను ఉపయోగించి నిరంతరం పర్యవేక్షిస్తున్నాము. బహిరంగంగా మద్యం సేవించడం, గంజాయి వినియోగం, పేకాట నిర్వహణ, ఈవ్ టీజింగ్, చైన్ స్నాచింగ్, రహదారి ప్రమాదాలు, దొంగతనాలు, రద్దీ ప్రాంతాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా డ్రోన్ కెమెరాల ద్వారా చర్యలు చేపడతాము. ఎవరైనా చట్ట వ్యతిరేక, క్రిమినల్ చర్యలకు పాల్పడితే చర్యలు తీసుకుంటాము.

నేర నియంత్రణలో జిల్లా పోలీసు శాఖ మరో అడుగు ముందుకు వేసింది. ఇప్పటికే సీసీ కెమెరాల ద్వారా నిందితులను గుర్తించి అనేక కేసులను ఛేదిస్తుండగా తాజాగా శాంతి భద్రతల పరిరక్షణకు డ్రోన్లతో నిఘాను ఏర్పాటు చేస్తోంది. ఈ మరపక్షుల ద్వారా ఆకాశం నుంచి అసాంఘిక శక్తులను గుర్తించే చర్యలు చేపట్టింది. ముఖ్యంగా నిర్మానుష్య ప్రదేశాలపై ఎక్కువ దృష్టిపెట్టి గొడవలు, ఓపెన్ డ్రింకింగ్, గంజాయి విక్రయాలతోపాటు అనేక నేరాలకు అడ్డుకట్ట వేస్తోంది. ఎస్పీ జీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు నగర డీఎస్పీ పీ సింధుప్రియ ఆధ్వర్యంలో అన్నీ స్టేషన్ల పరిధిలో డ్రోన్లను విస్తృతంగా వినియోగిస్తున్నారు.

- **పలు కేసుల నమోదు**

నెల్లూరు నగరంలో నేరాలు జరిగేందుకు ఆస్కారం ఉండే ప్రదేశాలను పోలీసులు ముందుగా గుర్తించారు. పాడుపడిపోయిన బంగ్లాలు, తోటలు, బహిరంగ ప్రదేశా లు, పార్కులు, నదీ తీర ప్రాంతాలపై డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేశారు. ఆ డ్రోన్లకు అమర్చిన కెమెరాల సాయంతో బుధ, గురు వారాల్లో అనేక కేసులు నమోదు చేశారు. ఓపెన్ డ్రింకింగ్‌పై 48 కేసులు కట్టారు. రెండు పేకాట స్థావరాలను గుర్తించి ఆకస్మిక దాడులు చేసి 12 మందిని అరెస్ట్ చేశారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరి వద్ద గంజాయిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు.

- నెల్లూరు(క్రైం,ఆంధ్రజ్యోతి)



డ్రోన్ ద్వారా గుర్తించిన ప్రదేశంలో నిందితులను అరెస్టు చేస్తున్న పోలీసులు

అమృత్ సరోవర్ 2.0

పనులకు శ్రీకారం

- చెరువుల అభివృద్ధికి ప్రణాళిక
- పంచాయతీకి ఒకటి చొప్పున ఎంపిక
- డ్వామా అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు

సంగం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : చెరువులను బలోపేతం చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. నీటి నిల్వ సామర్థ్యం పెంచేవిధంగా పూడికతీత పనులకు శ్రీకారం చుట్టాలని సంకల్పించింది. కట్టలను పటిష్ఠం చేసి కంప చెట్ల తొలగింపు పనులు చేపట్టాలని ఉత్తర్వులు జారీచేసింది. జిల్లాలో పంచాయతీకి ఒక కుంట లేదా చెరువును ఎంపిక చేయాలని జిల్లా నీటియాజమాన్య సంస్థ అధికారులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయి సిబ్బంది చెరువులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.

- **గత ప్రభుత్వంలో కుంటుపడి..**

కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో రెండేళ్ల కిందట మొదటి అమృత్ సరోవర్ పథకంలో జిల్లాలో మండలానికి ఒకటి నుంచి మూడు చెరువుల వరకు అభివృద్ధి చేయాలని గత ప్రభుత్వం ఒక్కో చెరువు అభివృద్ధికి సుమారు రూ. కోటి నుంచి కోటిన్నర వరకు నిధులు మంజూరు చేసింది. అందులో భాగంగా నియోజకవర్గంలో ఆత్మకూరు చెరువు, ఏఎస్‌పేట మండలంలో హసనాపురం చెరువు, సంగం మండలంలోని ఎర్రచెరువులను ఎంపిక చేశారు. అయితే ఆత్మకూరు, హసనాపురంలో రెండు చెరువులకు పూర్తిస్థాయిలో పనులు చేసిన దాఖలాలు లేవు. సంగం ఎర్రచెరువు కట్టపై ఉపాధి హామీ కూలీలతో ముళ్ల కంపలను తొలగించి చేతులు దులుపుకున్నారు.

- **ప్రణాళికాబద్ధంగా..**

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రెండవ విడత అమృత్ సరోవర్ పథకం కింద జిల్లాలోని ప్రతి పంచాయతీలో ఒక చెరువు లేదా ఒక కుంటను అభివృద్ధి చేయనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. చిన్ననీటి పారుదల శాఖ పరిధిలో ఉన్న సాగుకు నీరందించే చెరువులను పటిష్ఠం చేయాలని నిర్ణయించారు. ఒక్కో చెరువు లేదా కుంటలో నీరు నిల్వ చేయడానికి కనీసం ఒక ఎకరా విస్తీర్ణం ఉండాలి. 10వేల క్యూబిక్ మీటర్ల నీరు నిల్వ చేసేవిధంగా పనులు చేయనున్నారు. ఇందుకోసం ఉపాధి హామీ పథకం నిధులు కేటాయించనున్నారు. చెరువులు, కుంటలను త్వరగా గుర్తించి అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు పంపించాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఒక్కో చెరువులో పనులకు ఉపాధి హామి పథకం కింద రూ. 5 నుంచి రూ. 10 లక్షల వరకు మంజూరు చేసే అవకాశం ఉంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధికారులు అంచనాలు రూపొందించే ప్రక్రియను వేగవంతం చేశారు.



మొదటి విడత అమృత్ సరోవర్ పథకంలో పనులకు నోచుకోని ఎర్రచెరువు

నకిలీ సర్టిఫికెట్లు ఇచ్చిన క్లర్క్‌పై కేసు

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఫోర్జరీ సంతకాలు, నకిలీ సర్టిఫికెట్లతో మోసాలకు పాల్పడుతున్న ఓ క్లర్క్‌పై చిన్నబజారు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. కే స్రవంతి శ్రీసాయి ఎడ్యుకేషనల్ సొసైటీ కరస్పాండెంట్‌గా ఉన్నారు. నెల్లూరు, ప్రకాశం, కడప, అనంతపురం జిల్లాల్లో జూనియర్, ఒకేషనల్, డిగ్రీ, పీజీ, బీఈడీ కళాశాలలు నిర్వహిస్తున్నారు. నెల్లూరు ఆర్టీసీ బస్టాండు సమీపంలో సొసైటీ ప్రధాన కార్యాలయం ఉంది. అందులో పొదలకూరు రోడ్డుకు చెందిన షేక్ ఆయిషా క్లర్క్‌గా పనిచేస్తున్నారు. విద్యార్థుల కోర్సు పూర్తయిన తర్వాత ఫీజులు పూర్తిగా చెల్లించిన వారికి ఒరిజినల్ సర్టిఫికెట్లను కరెస్పాండెంట్ సంతకం, స్టాంప్ వేసి ఇవ్వాల్సి ఉంది. అయితే ఆయిషా విద్యార్థుల నుంచి నగదు తీసుకుని ప్రొవిజనల్ కమ్ కన్సాలిడేటెడ్ మార్క్స్ మెమో, టీసీ, స్టడీ కమ్ కాండక్ట్ సర్టిఫికెట్లు ఇచ్చారు. విద్యార్థులకు నకిలీ సర్టిఫికెట్లు మంజూరు చేసినట్లు కరస్పాండెంట్‌కు తెలిసింది. ఆమె క్లర్క్‌ను నిలదీయగా తప్పయిపోయిందంటూ హడావిడిగా అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఇంటికి వెళ్లి చూడగా తాళం వేసి ఉంది. దీంతో సదరు క్లర్క్‌పై చర్యలు తీసుకోవాలని కరస్పాండెంట్ గురువారం రాత్రి చిన్నబజా రు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట మోసం

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట మోసం చేసిన ఇద్దరు వ్యక్తులపై చిన్నబజారు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. కోటమిట్ట మెక్లీన్స్‌రోడ్డుకు చెందిన షేక్ సిరాజ్ బాషా డిగ్రీ పూర్తి చేసి 2011 నుంచి 2024 వరకు కువైట్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేశారు. ఆ తర్వాత నెల్లూరులోనే ఉంటూ షేర్ మార్కెట్‌కు సంబంధించి ఆన్‌లైన్ ట్రేడింగ్ చేస్తున్నారు. గత సంవత్సరం డిసెంబరులో ఆన్‌లైన్‌లో నితిన్ అనే వ్యక్తి ట్రేడింగ్ ఏజెంట్‌గా పరిచయం అయ్యారు. ట్రేడింగ్‌కు సంబంధించిన సలహాలు ఇస్తారని నమ్మించి గోయల్ అనే మరో వ్యక్తిని పరిచయం చేశారు. ఇద్దరు కలిసి రమణదీప్ కౌర్ ఖాతాకు నగదు పంపితే లాభం వస్తుందని చెప్పారు. దీంతో సిరాజ్‌ఖాన్ పలు దఫాలుగా రూ.1,01,000 నగదును పంపారు. కొద్ది రోజుల తర్వాత నితిన్ ట్రేడింగ్‌లో రూ.3.50 లక్షల లాభం వచ్చిందనీ, తన కమీషన్ రూ.60 వేలు పంపితే కంపెనీ నుంచి డబ్బులు వస్తాయని సిరాజ్ బాషాకు చెప్పాడు. అతని మాటలు నమ్మశక్యంగా లేకపోవడంతో బాధితుడు గట్టిగా నిలదీయగా ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. మోసపోయానని గ్రహించిన సిరాజ్ బాషా సైబర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేసి చిన్నబజారు పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సోమశిలలో 63.714 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి గురు వారం 1,013 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 63.714 టీఎంసీల నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 200, డెల్టాకు 2,800, ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

కండలేరు నీటిమట్టం 53.47 టీఎంసీలు

రాపూరు, (ఆంధ్రజ్యోతి): కండలేరు నీటిమట్టం సామర్థ్యం 68 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి మట్టం 53.47 టీఎంసీలుగా ఉందని కండలేరు డ్యామ్ ఏఈ కట్ట తిరుమలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో సోమశిల ఇన్‌ఫ్లో నీరు ఆగి పోగా, వివిధ కాలువల ద్వారా అవుట్ ఫ్లో 1135 క్యూసెక్కులు వెళ్తుందని ఆయన తెలిపారు.

ఉరేసుకుని వివాహిత బలవన్మరణం

తోటపల్లిగూడూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పేడూరు దళితకాలనీలో గురువారం ఉరేసుకుని ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు, దళితకాలనీకి చెందిన గున్నం సరిత (29)కి కోవూరు మండలం కట్టకింద చెర్లోపాలేనికి చెందిన నరేంద్రకు 2020లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. కుటుంబ కలహా లతో వీరు ఏడేళ్లుగా విడిగా ఉంటు న్నారు. సరిత నెల్లూరులోని ఓ క్యాటరింగ్ సర్వీస్‌లో పనిచేస్తూ పిల్లలను పోషించుకుంటోంది. ఈ క్రమంలో గురువారం సరిత తన ఇంట్లోని ఫ్యాన్‌కి ఉరి వేసుకుని మృతి చెందడం కాలనీలో కలకలం రేపింది. సరిత తండ్రి మోచర్ల రాధయ్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ వీరేంద్రబాబు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తు న్నారు. భర్తలేని జీవితం తనకెందుకనే మనస్థాపంతో ఆమె బలవన్మరణానికి పాల్పడినట్లు బంధువులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	114
లేయర్ లైవ్	80
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	234
లేయర్	136

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8212
వెండి కిలో ధర	రూ. 98,500
వెండి ఒక గ్రాము	రూ.101.50

విద్యా, వైద్యరంగాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే కాకర్ల



భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్, టీడీపీ నాయకులు

ఉదయగిరి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో విద్యా, వైద్యరంగాలను అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన సేవలందిచేందుకు కృషిచేస్తున్నట్లు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్, టీడీపీ నాయకులతో కలిసి పీఎం ఉష పథకం కింద రూ.5 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులకు భూమిపూజ చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. త్వరలో 22 నూతన శుద్ధిజల కేంద్రాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. వెలుగొండ, సోమశిల హైలెవల్ కెనాల్‌కు రానున్న బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించేలా చర్యలు చేపట్టి, వాటి పనులను త్వరితగతిన పూర్తిచేసి సాగు, తాగునీటి కష్టాలు తీరుస్తామన్నారు. ఉదయగిరి దుర్గాన్ని పర్యాటక కేంద్రంగా మార్చి ఈప్రాంత అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. నియోజకవర్గంలో పరిశ్రమలు నెలకొల్పి యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడమే తన ధ్యేయమన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరలో ఉదయగిరి ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, పొలిటికల్ మేనేజర్ మాలేపాటి చైతన్య, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చిరంజీవి రెడ్డి, టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు రియాజ్, ప్రిన్సిపాల్ ఎల్ నారాయణస్వామి, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ సుబ్బరాయుడు, ఏఈ శ్రావణ్, గుత్తేదారులు గడ్డం శ్రీనివాసులు, బొజ్జా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను కార్యాలయం చుట్టూ తిప్పించుకోవద్దు

ఉదయగిరి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలను కార్యాలయం చుట్టూ తిప్పించుకోవద్దని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సూచించారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఎన్ని అర్జీలు వచ్చాయి.. ఎన్ని పరిష్కరించారంటూ తహసీల్దారు సుభద్రను ప్రశ్నించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పలు సమస్యలపై ప్రజలు అందజేసిన వినతులను స్వీకరించారు.

న్యూస్ బాక్స్

ఉపాధి పనులు కల్పించాలి

అనంతసాగరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులు కల్పించాలని స్థానిక ముస్లీం కాలనీ వాసులు ఎంపీడీవో కార్యాలయం వద్ద గురువారం నిరసన తెలిపి అధికారులకు వినతిపత్రం అందించారు. వ్యవసాయ పనులు పూర్తయ్యాయని, ప్రస్తుతం పనులు లేక ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల అధ్యక్షుడు అన్వర్‌బాషా, పొలయ్య, సందాని తదితరులు పాల్గొన్నారు.

విలీనం వద్దంటూ నిరసన

అనంతసాగరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సోమశిలలోని మెయిన్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులను హిల్ కాలనీకి విలీనం చేసే ప్రక్రియ ఆపాలని డిమాండ్ చేస్తూ గురువారం పాఠశాల వద్ద నిరసన తెలిపారు. విలీనం చేస్తే విద్యార్థులు 2 కి.మీ నడిచి వెళ్లాల్సి ఉంటుందని వాపోయారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు వేగు పెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉలవపాడువాసికి డాక్టరేట్

ఉలవపాడు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బీసీ యాదవ కాలనీకి చెందిన ఓగుబోయిన యానాది, మస్తానమ్మల పెద్ద కుమారుడు శ్రీకాంత్ విశ్లేషణాత్మక రసాయన శాస్త్రం మీద పరిశోధనలు చేసి డాక్టరేట్ అందుకున్నాడు. ఈ నెల 5న తన గైడ్ ఎస్ఎం బోయర్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందుకున్నట్లు శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, ఆయనకు అభినందనలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో షబే బరాత్

అనంతసాగరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి):సోమశిల,ఉప్పలపాడు, అనంతసాగరంలో గురువారం రాత్రి షబేబరాత్ వేడుకలను ముస్లీంలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈసందర్భంగా మసీదులను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఉదయగిరి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): గండిపాళెంలో ఇటీవల మృతిచెందిన గోరంట్ల వేణు కుటుంబ సభ్యులకు గురువారం సేవాగుణ ఫౌండేషన్ సభ్యులు రూ.21 వేలు, నియోజకవర్గ ఐటీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డిబత్తిన ఉమాసాయిరాం రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో కిరణ్, ఇమ్రాన్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.



నగదు ఇస్తున్న ఫౌండేషన్ సభ్యులు

గ్రంథాలయం తనిఖీ

సంగం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమారరాజా గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. పాఠకుల సంఖ్య పెరిగేందుకు కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా పంచాయతీల నుంచి రావాల్సిన సెస్ బకాయిలు వసూలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట గ్రంథాలయ లైబ్రేరియన్ రవీంద్రరెడ్డి ఉన్నారు.



రికార్డులు చూస్తున్న కుమారరాజా

హౌస్ హోల్డ్ జియో ట్యాగ్ త్వరగా పూర్తిచేయండి

సీతారామపురం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): హౌస్ హోల్డ్ జియో ట్యాగ్ త్వరగా పూర్తి చేయాలని జడ్పీ డిప్యూటీ సీఈవో మోహన్ రావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇంతవరకు హౌస్ హోల్డ్ జియో ట్యాగ్ కాని కుటుంబాలకు త్వరగా మ్యాపింగ్ చేయాలని తెలిపారు. వలసలు పోయిన కుటుంబలను గుర్తించి హౌస్ హోల్డ్ మ్యాపింగ్ చేయించుకోవడం వల్ల కలుగు ప్రయోజనాలపై వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. ఆధార్ కార్డు లేని చిన్నపిల్లలను గుర్తించి వారికి ఆధార్ నమోదు చేసుకునేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్, ఈవో పీఆర్డీ భార్గవి తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రత .. అందరి బాధ్యత: ఆర్టీవో



మాట్లాడుతున్న ఆర్టీవో సుధాకర్ రెడ్డి

కావలి రూరల్, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): రహదారి భద్రత అందరి బాధ్యత అని ఆర్టీవో వై. సుధాకర్ రెడ్డి అన్నారు. పట్టణం లోని లారీ ఓనర్స్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో గురువారం జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆర్టీవో సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రహదారి భద్రతపై ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. కార్యక్రమంలో రమేష్ నాయుడు మాట్లాడారు. అసంఘటిత కార్మికుల కోసం ఉచితంగా గుర్తింపు కార్డులు ఇవ్వటం జరుగుతుందన్నారు. ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2 లక్షలు బీమా వర్తిస్తుంద న్నారు. కార్యక్రమంలో ఎంవీఐ సుందర్ రావు, అసిస్టెంట్ ఎంవీఐ కరుణాకర్, 1వ పట్టణ ఎస్ఐలు సుమన్, జమాల్ వలీ లారీ యూనియన్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు మండలి క్రిష్టారావు, రంగారెడ్డి, గూడ్సు డ్రైవర్లు, లారీ, ఆటో డ్రైవర్లు, స్కూల్, కళాశాలల బస్ డ్రైవర్లు పాల్గొన్నారు.

కుంకుమ, జాకెట్ల పంపిణీ

కందుకూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): గ్రామదేవత అంకమ్మ అమ్మవారి ఆలయంలో 24 గంటలపాటు లలితాసహస్రనామ పారాయణం చేసిన మహిళా భక్తులకు గురువారం ఆలయ కమిటీసభ్యులు అమ్మవారి కుంకుమ, జాకెట్లు పంపిణీ చేశారు. ఈ పారాయణ కార్యక్రమానికి విచ్చేసిన భక్తులందరికీ ఈ సందర్భంగా ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పొడపాటి నరసింహ్మం, గాయత్రీ రామకృష్ణ దంపతులు, వసంత, కోట వెంకటేశ్వర్లు, రావెళ్ల ప్రసాదు, ఆలయ కమిటీస భ్యులు వెంకటరెడ్డి, మురళి పాల్గొన్నారు.

అభివృద్ధికి తోడ్పాటు అందించాలని సీఎంని కోరతాం

- ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈనెల 15న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నియోజకవర్గ పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పార్టీ నాయకులు, కార్యకర్తలను పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారం చేపట్టిన 8నెలల్లోనే ముఖ్యమంత్రి నియోజకవర్గ పర్యటనకు వస్తుండటం ఆనందదాయకం అన్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని నియోజకవర్గ అభివృద్ధికి వరాలు కురిపించాల్సిందిగా ఆయనకు విజ్ఞప్తి చేస్తామని వివరించారు. ఎన్నికల హామీలలో కూడా ప్రధానమైనవి తక్షణం అమలుచేయాలని కోరుతామన్నారు. అలాగే రాళ్లపాడు ప్రాజెక్టుకు సోమశిల నుంచి నీరు ప్రవహించే జీకేఎస్ కెనాల్ వెడల్పు పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, కందుకూరు మున్సిపాలిటీకి తక్షణం నిధులు విడుదలకు చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు తెలిపారు. మరికొన్ని సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, మాదాల లక్ష్మీనరసింహ్మం, నార్నె రోశయ్య, జనిగర్ల నాగరాజు, చదలవాడ కొండయ్య, చిలకపాటి మధు, రఫి, బెజవాడ ప్రసాద్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గట్టమనేని హరిబాబు పాల్గొన్నారు.

డెయిరీ ఫాం నిర్మాణానికి శంకుస్థాపన

స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రగుంటపాలెం వద్ద ఏర్పాటు చేస్తున్న శ్రీ లక్ష్మీనరసింహ్మా డెయిరీఫాంకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు మర్రిపూడి మహేంద్ర, మాధవ, నాయకులు దామా మల్లేశ్వరరావు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, గట్టమనేని హరిబాబు, నాదెళ్ల వెంకట రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా పుష్పయాగం

కావలి టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): హనుమత్ క్షేత్రంలో గురువారం లక్ష్మీపద్మావతి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి పుష్పయాగ మహోత్సవం కనులపండువగా జరిగింది. ఆలయ వ్యవస్థాపక ప్రధాన అర్చకులు వేదగిరి సూర్యనారాయాణాచార్యులు పర్యవేక్షణలో జరుగుతున్న ఉత్సవాల్లో ఉదయం అష్టోత్తర కలశ స్థాపన పారమాత్మిక శాంతిహోమం నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గ్రామాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి

కలువాయి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి):గ్రామాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కోరారు. కుల్లూరులో నూతనంగా నిర్మించిన శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఆలయాన్ని పునర్నిర్మించిన సీతారామును అభినందించి ఇలాంటి వారు గ్రామాభివృద్ధికి ముందుకు రావాలన్నారు. అనంతరం అన్న దానం, సాయంత్రం స్వామివార్ల గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఇమ్మడి సిద్ధరామేశ్వర స్వామిజీ, మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం, టీడీపీ కన్వీనర్ వెంకటేశ్వర్లు నాయుడు పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్ఠలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల

చెత్త సంపద కేంద్రాలు ప్రారంభించాలి

సంగం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి):డివిజన్‌లోని అన్ని పంచాయతీల్లో ఈ నెల 15వ తేదీ నాటికి చెత్తసంపద కేంద్రాలు ప్రారంభించడానికి సిద్ధం చేస్తున్నట్లు డీఎల్‌పీవో నయీం తాజ్ హసన్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటిపన్నులు, స్వర్ణ పంచాయతీ, చెత్తసంపద కేంద్రాల పనితీరు తదితర అంశాలపై సమీక్షించారు. ఈనెల 15వ తేదీ నుంచి అన్ని చెత్త సంపద కేంద్రాలు ప్రారంభించాలని, ఆమేరకు పంచాయతీల్లో గ్రీన్ అంబాసిడర్స్‌ను ఏర్పాటుచేసి చెత్త సేకరించి పొడి, తడి చెత్త వేరు చేసి చెత్త సంపద కేంద్రాలకు తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఈవోఆర్డీ వరప్రసాద్ ఉన్నారు.



కార్యదర్శులతో సమావేశమైన డీఎల్‌పీవో నయీం తాజ్ హసన్

'పోషణ్ బీ పడాయి బీ'పై అవగాహన

సంగం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ భవనంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ బీ పడాయి బీ (చిన్నారుల సంరక్షణ, పోషకాహారం) కార్యక్రమంపై ఐసీడీయస్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీయస్ సీడీపీవో సునీలత, ప్రధానోపాధ్యాయులు బుజ్జయ్య పాల్గొని ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ, పోషకాహారం, బాల్య విద్యపై సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఐసీడీయస్ సూపర్‌వైజర్ పద్మావతి, స్కూల్ ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ మోహన్ పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో సునీలత

- వలేటివారిపాలెం: అంగన్‌వాడీకేంద్రాలకు వచ్చే ప్రీస్కూల్ చిన్నారులకు ఆట పాటల తో కూడిన విద్యనందించాలని ఎంపీడీఓ నరేంద్రదేవ్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయలో అంగన్‌వా డీ కార్యకర్తలకు పోషణ బీ, పడాయి బీ అనే కార్యక్రమంపై నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత, తహసీల్దార్ అబ్దుల్‌అమీద్, ఎంఈఓ-2 మల్లికార్జునరావు, సీహెచ్ఓ శివరామయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

కలువాయి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎన్ఎంఎస్) పథకానికి మండలంలోని చీపినాపి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు షేక్ ఖాజానబి, కార్తీక్, షేక్ రహమాన్, అర్హత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.జనార్ధన్‌రెడ్డి తెలిపారు. కాగా, అర్హత సాధించిన విద్యార్థులను గురువారం పాఠశాలలో హెచ్ఎం సన్మానించారు. ఇందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. ఆర్థికంగా వెనుకబడి ప్రతిభ గల విద్యార్థులకు ఈ పథకం కింద 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.12వేలు వంతున స్కాలర్‌షిప్ అందిస్తారు.



విద్యార్థులను సన్మానిస్తున్న హెచ్ఎం. జనార్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక

సంగం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎనిమిది మంది విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్)కు ఎంపకయ్యారని ఎంఈవో జానకీరామ్ తెలిపారు. సంగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వి లీలానంద కుమార్‌రెడ్డి, సీహెచ్ మోక్షిత, కె హరిత, పివి యోగిత, జి ఇంద్రజ, బి షణ్ముఖప్రియ, అదేవిధంగా తరుణవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన గంటా గిరిష్మ, షేక్ అల్పియా ఎంపికయ్యారు.



ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికయిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

బోగోలులో ఎమ్మెల్యే దగుమాటి పర్యటన



విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే దగుమాటి

బిట్రగుంట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడి గురించి పర్యటించారు. ముందుగా సోమేశ్వరపురం, కమ్మపాలెంలో పోతురాజుస్వామి సమేత పోలేరమ్మతల్లి, మహాలక్ష్మ నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. అనంతరం బోగోలు కుమ్మరవీధికి చెందిన టీడీపీ సీనియర్ నేత మేకల వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు, కప్పరాళ్ళతిప్ప బాడన్ పేటలోని గోగుల శిరీష కుటుంబ సభ్యులు, కోవూరుపల్లిలో కార్పెంటర్ ఖాదర్‌భాషా కుటుంటసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ నాగేశ్వరరావు, మధుబాబునాయుడు, ఎం. వెంకయ్య, వెంకటేశ్వరరెడ్డి, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఉద్యమంలా స్వచ్ఛాంధ్ర

కావలిటౌన్, ఫిబ్రవరి 13: స్వచ్ఛఆంధ్ర కార్య క్రమాన్ని రాష్ట్రప్రభుత్వం ఉద్యమరూపంలో చేపట్టిందని మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. గురువారం పట్టణ 10వ వార్డులో స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యే దగుమాటి క్రిష్ణారెడ్డి సూచనలతో 10వ వార్డును (మోడల్) పైలెట్ వార్డుగా ఎంపిక చేశామన్నారు. డ్రైనేజీ, పారి శుధ్య పరిరక్షణ తదితర స్థానిక సమస్యలను గుర్తించి నూరు శాతం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా స్థానికులు కొన్ని సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో వార్డు టీడీపీ నాయకులు వల్లేరి కిరణ్‌కుమార్, ఎం.సుకుమార్, ఎల్లంటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సమస్యలపై 17న ధర్నా

ఉలవపాడు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సమస్యలపై ఈనెల 17న ఉలవపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు వద్ద ధర్నా చేపట్టనున్నట్లు సీఐటీయూ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, జీవీబీ కుమార్, ఇందిరా, లతారెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం వారు సీడీపీవో అరుణకు వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీల కనీస వేతనం రూ.26వేలకు పెంచాలని డిమాండ్ చేశారు.

భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లో గురువారం రాత్రి ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. షబే-ఏ-బరాత్ సందర్భంగా ముస్లింలు మసీదులకు చేరుకుని రాత్రంతా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మసీదులో భక్తుల సౌకర్యార్థం అల్పాహారం ఏర్పాటు చేశారు.

నిధుల మంజూరు

లింగసముద్రం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కలెక్టర్ రూ.12లక్షలు మంజూరు చేసినట్లు గురువారం కందుకూరు ఆర్అండ్‌బీ ఏఈ షేక్ అహమ్మద్ బాషా తెలిపారు. ఈ నెల 6న టెండర్లు పూర్తి చేశారని త్వరలో పనులు పనులు ప్రారంభిస్తామన్నారు.

శిథిలావస్థలో వసతిగృహం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ బాలుర వసతిగృహం శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రతి ఏడాది విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పడుతోంది. గదుల శ్లాబు పెచ్చులూడుతుండడంతోపాటు తలుపులు, కిటికీలు, మరుగుదొడ్లు అధ్వానంగా మారాయి. అటు వైపు చూసిన విద్యార్థులు, తల్లిదండ్రులు వెను కడుగు వేస్తున్నారు. ప్రస్తుతం 24 మంది ఉండడం ఆ హాస్టల్లో ఉండటం విశేషం.



పెచ్చులూడుతున్న గది

లేఅవుట్లను కన్వర్షన్ చేసుకోవాలి

తోటపల్లిగూడూరు, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): ప్రతి లేఅవుట్ యజమాని కచ్చితంగా కన్వర్షన్ చేసుకోవాలని నెల్లూరు ఆర్డీవో నాగసంతోష్ అనూష తెలిపారు. మండలంలోని వరిగొండ, తోటపల్లి గూడూరు బిట్-2లో గురువారం ఆమె లేఅవుట్లలో నిర్మిస్తున్న నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ లేఅవుట్ల యజమానులు నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు మండలంలోని లేఅవుట్లను పరిశీలించి, అనధికార లేవుట్లపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు కృష్ణ ప్రసాద్, డీటీ శివయ్య, ఆర్ఐ ద్వారకానాథ్ తదితరులు పాల్గొన్నారు.



లేఅవుట్లలో జరుగుతున్న నిర్మాణాలను పరిశీలిస్తున్న ఆర్డీవో అనూష

ఖేలో ఇండియాలో 'నారాయణ'కు పతకాలు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : తమిళనాడులో ఇటీవల జరిగిన ఖేలో ఇండియా మహిళల పెన్‌కాక్ సిలాట్ పోటీల్లో నారాయణ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులు పతకాలు సాధించారు. గురువారం కళాశాలలో విజేతల అభినందన కార్యక్రమం జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ జీ శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్వహించిన సౌత్‌జోన్ పోటీల్లో తమ విద్యార్థినులు ఎస్ నిఖిల, పీ హారిక, తనుష ఉత్తమ ప్రతిభ కనబరిచి రజిత, కాంస్య పతకాలు సాధించారని చెప్పారు. కార్యక్రమంలో కన్వీనర్ టీపీ వరప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్స్ డీ ప్రసాద్, డీ అనూరాధ, ఈసీసీ హెడ్ డాక్టర్ కే మురళి, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి

ప్రణతికి డాక్టరేట్



నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరుకు చెందిన ఓ ప్రణతి డాక్టరేట్ సాధించారు. హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ ఎకనామిక్స్ అండ్ సోషల్ స్టడీస్(సీఈఎస్ఎస్)లో ప్రొఫెసర్ సీహెచ్ బలరాములు పర్యవేక్షణలో పట్టణ, స్థానిక రాజకీయాల్లో మహిళల పాత్ర అనే అంశంపై చేసిన పరిశోధనకు ఆమెకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రణతి అనంతపురంలోని కేంద్ర విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

టిడ్కో ఇళ్లను సందర్శించిన జన'సేన'

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వెంకటేశ్వరపురంలో ఉన్న టిడ్కో ఇళ్లను జనసేన పార్టీ నాయకులు గురువారం సందర్శించారు. స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నాయకుడు నూనె మల్లికార్జున యాదవ్ మాట్లాడుతూ ఆ ప్రాంతంలో వాటర్ ప్లాంట్, రేషన్ షాపు, సచివాలయం కావాలని ప్రజలు కోరారన్నారు. మంత్రి పొంగూరు నారాయణ, టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్, నగర కమిషనర్ సూర్యతేజ దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు జమీర్, సుల్తాన్ బాషా, పవన్ యాదవ్, శ్రీపతి రాము, వై రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.



టిడ్కో ఇళ్లలో ఉంటున్న ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న జనసేన నాయకులు

భూముల రీ సర్వే ప్రక్రియ పరిశీలన

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇస్కపాళెం గ్రామ పరిధిలో జరుగుతున్న భూముల రీసర్వేను గురువారం జేసీ కే. కార్తీక్ పరిశీలించారు. గ్రామంలోని బెల్లంకొండ రమణయ్యకు చెందిన పొలంలో జరుగుతున్న రీసర్వేని పరిశీలించి ఆయనతో మాట్లాడారు. అనంతరం రీసర్వే వివరాలను వీఆర్వో, సర్వేయర్‌లను అడిగి తెలుసుకుని రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు రీసర్వేలో తమకు ఎదురైన సమస్యలను, ఇతర సమస్యలను జేసీ దృష్టికి తెచ్చారు. ఆయన వెంట తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లు, రెవెన్యూ సిబ్బంది, ఎస్ఐ సంతోష్‌రెడ్డి, రైతులు ఉన్నారు.



వీఆర్వో, సర్వేయర్‌తో మాట్లాడుతున్న జేసీ కార్తీక్

ఈతకోటకు మాడభూషి జీవిత సాఫల్య పురస్కారం

వెంకటాచలం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : సాహితీ రంగంలో నలభైఏళ్లగా తనదైన ముద్రవేసిన ఈతకోట సుబ్బారావుకి మాడభూషి సాహిత్య కళా పరిషత్ ఆధ్వర్యంలో మాడభూషి జీవిత సాఫల్య పురస్కారం లభించింది. దీంతో గురువారం చెన్నైలోని మద్రాసు యూనివర్సిటీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సుబ్బారావు ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు, మాడభూషి సాహిత్య కళా పరిషత్ సంస్థాపకుడు మాడభూషి సంపత్‌కుమార్ చేతులమీదుగా ఈ పురస్కారాన్ని సుబ్బారావుకు అందించి శాలువాతో సత్కరించారు.



సుబ్బారావుకి పురస్కారాన్ని అందిస్తున్న మాడభూషి సంపత్‌కుమార్

బుచ్చిలో స్వచ్ఛందంగా ఆక్రమణల తొలగింపు

బుచ్చిరెడ్డిపాళెం,ఫిబ్రవరి13 (ఆంధ్రజ్యోతి) : పట్టణం నడిబొడ్డులోని బస్టాండ్ సెంటర్‌లో 45 ఏళ్లుగా ఉన్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించింది. ఆది నుంచి బస్టాండ్ సెంటర్లో హైవే నుంచి చెన్నూరురోడ్డుకు వెళ్లే మార్గంలో మూడు రోడ్ల కూడలి నిత్యం రద్దీని తలపించేది. చెన్నూరురోడ్డు కూడలిలో ప్రతిరోజు ఉదయం నుంచి రాత్రి వరకు ట్రాఫిక్ అంతరాయం కలిగేది. దీంతో అధికారులు కూడా తలలు పట్టుకునే పరిస్థితి నెలకొంది. అలాంటిది ఎమ్మెల్యే ప్రశాంతమ్మ ఏలుబడిలో ఆక్రమణదారులే స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించుకున్నారు. చైర్‌పర్సన్, కమిషనర్, సీఐ, ఎస్ఐ వ్యాపారస్తులతో చర్చించి ఆక్రమణల తొలగింపునకు మార్గం సుగమనం చేశారు.



విశాలంగా బుచ్చి బస్టాండ్ సెంటర్‌లోని హైవే

మా పొట్ట కొట్టొద్దు.. : చైర్‌పర్సన్‌కు అరటిపండ్ల వ్యాపారుల వినతి

బుచ్చిరెడ్డిపాళెం,ఫిబ్రవరి13:(ఆంధ్రజ్యోతి): ఆక్రమణల తొలగింపు పేరుతో తమ పొట్టలు కొట్టవద్దని బుచ్చి చెన్నూరు రోడ్డులోని అరటిపండ్ల వ్యాపారులు గురువారం చైర్‌పర్సన్ మోర్ల సుప్రజకు మొర పెట్టుకున్నారు. తమకు ప్రత్యామ్నాయం చూపించాలని కోరారు. స్పందించిన చైర్‌పర్సన్ మీ సమస్యను ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దృష్టికి తీసుకెళ్లి , మీకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా న్యాయం జరిగేలా చూస్తామని మాటిచ్చారు. వ్యాపారులకు అనుకూలంగా ఆర్టీసీ డిపో ప్రాంతాన్ని కేటాయిస్తే అనుకూలంగా ఉంటుందనే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేశారు.



చైర్‌పర్సన్‌కు వినతిపత్రం ఇస్తున్న వ్యాపారులు

ఘనంగా ఉడయవర్ల బ్రహ్మోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నవాబుపేట ఉడయవర్లు దేవస్థానంలో మాఘ మాస బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిగాయి. గురువారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత ఆదికేశవ స్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం నగరోత్సవం జరిగింది. రాత్రి స్వామివారికి అశ్వవాహన సేవ, పారువేట ఉత్సవం జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ చైర్మన్ పల్లాప్రోలు రామకృష్ణమాచార్యులు, ఉభయకర్తలు పర్యవేక్షించారు.



నగరోత్సవంలో శ్రీదేవి, భూదేవి సమేత ఆదికేశవస్వామి

దాహం.. దాహం..!

- పోలినాయుడు చెరువులో గొంతెండుతున్న గిరిజనులు
- ఏళ్ల తరబడి తాగునీటికి ఇక్కట్లు
- ఒక్క వీధిలోనూ కుళాయి లేని వైనం
- పట్టించుకోని అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి13: (ఆంధ్రజ్యోతి): వేసవి రాకముందే మండలంలోని పోలినాయుడు చెరువు గ్రామంలో గిరిజనులు తాగునీటికి ఇక్కట్లు పడుతున్నారు. ఏళ్ల తరబడి సమస్య ఉన్నా అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. గ్రామంలోని ఏ ఒక్క వీధిలోనూ పంచాయతీ కుళాయిలు లేవు. తమ దాహార్తి తీర్చాలని ఎన్నో సార్లు గ్రామస్థులు అధికారులకు మొరపెట్టుకున్నా లాభం లేకపోయింది. బుచ్చి మండలం ఇస్కపాళెం పంచాయతీ పరిధిలోని పోలినాయుడు చెరువు గ్రామంలో గిరిజనులు, ముస్లింలవి కలిపి మొత్తం 600 ఇళ్ల వరకు ఉన్నాయి. 1100మంది ఓటర్లు ఇక్కడ ఉన్నారు. రోజంతా కూలికి వెళితేకానీ పూడగడవని పరిస్థితులు గ్రామస్థులవి. ఇలాంటి గ్రామంలో తాగునీటి సమస్య వేధిస్తున్నది. ఇస్కపాళెంలోని కృష్ణ మందిరం నుంచి గ్రామంలోని ప్రధాన మార్గంలో ఒకే పైపులైను వుంది. అక్కడివారు మోటారు వేస్తే అరగంట మాత్రమే నీళ్లు వస్తాయి. అవి ఎప్పుడు వస్తాయో తెలియక బిందెలు కుళాయిల వద్ద పెట్టుకుని గ్రామస్థులు నిరీక్షిస్తుంటారు. పైపులైనులో నీరు రాకుంటే సుమారు కిలోమీటరుకుపైగా పొలాల్లోకి వెళ్లి తెచ్చుకుంటుంటారు. చేసేది లేక కొందరు గ్రామంలోని చేతిపంపుల వద్ద నీరు పట్టుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు తాగునీటి సమస్యను తీర్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.



పోలినాయుడు చెరువు గ్రామంలో చేతి పంపు వద్ద నీళ్లు పట్టుకుంటున్న మహిళలు



పంచాయతీ కుళాయి వద్ద నీటి కోసం మహిళ నిరీక్షణ

● రెండు బోర్లు ఉన్నా...

ఇస్కపాళెంలోని కృష్ణమందిరం వద్ద రెండు బోర్లు ఉన్నాయి. రెండింటి ద్వారా సరఫరా అయ్యే నీరు పోలినాయుడు చెరువు గ్రామానికి సరిపోతాయి. నీరు ఎక్కువ సేపు రానందున సమస్య ఉత్పన్నమైంది. చిన్నమోటారును ఐదేళ్ల క్రితం ఓ నేత ఏలుబడిలో ఏర్పాటు చేయడంతో ఆ బోరు నీళ్లనే వాడాలని ఆయన హెచ్చరించారు. ఆ నేత పట్టుదల గిరిజనలకు శాప మైంది. ఇప్పటికైపా కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని తమ దాహార్తి తీర్చాలని పోలినాయుడు చెరువు గ్రామ గిరిజనులు కోరుతున్నారు.

రూరల్‌లో రూ.191 కోట్లతో అభివృద్ధి పనులు : శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ ఎనిమిది నెలల్లోనే నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో రూ.191 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే కొన్ని పనులు పూర్తయ్యాయని, మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. గురువారం నెల్లూరులోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రోడ్లు, కాలువల నిర్మాణంతోపాటు ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నట్లు వివరించారు. ఇంతటి అభివృద్ధికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ ప్రధాన కారణమన్నారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని దివాలా తీయించినప్పటికీ, చంద్రబాబు తన అనుభవంతో అభివృద్ధి పథంలో తీసుకెళుతున్నారని కొనియాడారు. నేరుగా తన ఫోన్ నెంబర్‌కే మెసేజ్ రూపంలో ప్రజలు సమస్యలు తెలియజేయవచ్చన్నారు. రాబోయే ఐదేళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రూ.వెయ్యి కోట్లతో రూరల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలన్నది తన లక్ష్యంగా ప్రకటించారు. పొట్టేపాలెం కలుజు మీద వంతెన, చింతారెడ్డిపాలెం క్రాస్‌రోడ్డు వద్ద హైవేపై అండర్‌పాస్‌ను సాధించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతీ ఇంటికీ వెళ్లి సమస్యలు తెలుసుకునేందుకే గిరిధర్‌రెడ్డి గడప గడపకు తిరుగుతున్నారని చెప్పారు.



విలేకరులతో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

● అభివృద్ధి పనుల ప్రారంభం

నెల్లూరు రూరల్, (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ మండలంలోని పెనుబర్తి గ్రామం, నగరంలోని 30వ డివిజన్ పరిధిలో రూ. 60 లక్షల విలువ చేసే అభివృద్ధి పనులను రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో రాజీపడితే కఠినంగా చర్యలు తీసుకుంటామని అధికారులు, కాంట్రాక్టర్లను హెచ్చరించారు. కాగా, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మండలంలోని మాదరాజుగూడూరులో గడప గడప కార్యక్రమం చేపట్టారు.

వీవోలు, సీసీఎస్‌లకు శిక్షణ



మాట్లాడుతున్న సీసీ సుధాకర్

రాపూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం ఏపీఎం రాధారెడ్డి ఆధ్వర్యంలో వీవోలకు, సీసీఎస్‌లకు శిక్షణ తరగతులు సీసీ సుధాకర్ నిర్వహించారు. లోకోస్‌కు సంబంధించి స్వయం ఉపాధి గ్రూపుల కట్ ఆఫ్ డేటా, పొదుపు గ్రూపుల ట్రాన్సాక్షన్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు, శనివారం వరకు తరగతులు నిర్వహించనున్నట్లు రాధారెడ్డి తెలిపారు.

'మాతృత్వ అభియాన్'ను సద్వినియోగం చేసుకోవాలి

నెల్లూరు (వైద్యం) ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్(పీఎం ఎస్ఎంఏ) పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని నగరంలోని వెంగళరావు నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రీనా భారతి వెల్లడించారు. గురువారం ఆ ఆరోగ్య కేంద్రంలో పీహెచ్‌పీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతినెల ప్రతినెల 11, 13 తేదీల్లో జాతీయ స్థాయిలో జరిగే పీఎంఎస్ఎంఏ కార్యక్రమాన్ని స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వేతర సంస్థలు ప్రజలకు చేయాలని కోరారు. దీనిద్వారా మాతా,శిశు మరణాలను నివారించవచ్చన్నారు. ఈ పథకం ద్వారా పట్టణ ప్రాంతాల్లో ఉన్న వారికి రూ. 5 వేలు, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వారికి రూ. 6 వేలు ప్రసవానంతరం ప్రోత్సాహక నగదు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌పీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, అధ్యక్ష, కార్యదర్శులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రసూల్, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రీనా భారతి

తక్కువ చార్జీలతో త్రీ స్టార్ సేవలు

● హరిత హోటల్ మేనేజర్ సాహిత్యరెడ్డి

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థకు చెందిన నెల్లూరు హరిత హోటల్‌లో తక్కువ చార్జీలతో 3స్టార్ సేవలను పర్యాటకులకు, వినియోగదారులకు అందిస్తున్నట్లు ఆ హోటల్ మేనేజర్ సాహిత్యరెడ్డి తెలిపారు. గురువారం ఆయన ఆంధ్రజ్యోతితో తన కార్యాలయంలో మాట్లాడారు.



ఈతరం ముఖాముఖి

? : హరిత హోటల్లో ఎన్ని రూములు ఉన్నాయి.

! : మొత్తం 54 రూములున్నాయి. ఇందులో 5 కేటగిరీలున్నా యి. స్టాండర్డ్ కేటగిరి రూములు 8 ఉన్నాయి. వాటికి రోజుకి అద్దె రూ.2016, లగ్జరీ రూములు 12, అద్దె రూ.2352, ఎగ్జిక్యూటివ్ రూములు 18, అద్దె రూ.2600, సూట్స్ 9 ఉన్నాయి, అద్దె రూ.3250. వీఐపీ సూట్స్ 7 ఉన్నాయి, అద్దె రూ.3800. ఈ చార్జీలు నగరంలోని స్టార్ హోటళ్లతో పోలిస్తే చాలా తక్కువ.

? : కాన్ఫరెన్స్ హాల్స్ సౌకర్యం ఉందా...

! : పెళ్లిళ్లు, ఇతర శుభకార్యక్రమాలు చేసుకునేందుకు అన్ని వసతులతో రెండు కాన్ఫరెన్ హాల్స్ ఉన్నాయి. వాటి అద్దె 8 గంటలకు రూ.18వేలు. 250 సీట్ల సామర్థంతో ఉన్నాయి. ఇన్‌హౌస్ బార్ అండ్ రెస్టారెంట్, భోజనం రెస్టారెంట్ ఉన్నాయి. స్వర్ణాల చెరువు వద్ద గల బోటు క్లబ్ ఓపెన్ ప్లేస్‌లో పార్టీలు, ఫంక్షన్లు చేసుకోవచ్చు. దాని అద్దె రూ.11,500.

?: విడిది చేసిన వారికి మీరిచ్చే సేవలు.

! : హరిత హోటల్‌లో విడిది చేసిన అతిథులకు ఉచితంగా వెల్కం బ్రేక్ ఫాస్ట్ అందజేస్తాం. రూములో డెంటల్ కిట్, వాటర్ బాటిల్స్ ఉచితంగా సరఫరా చేస్తాం. వారు కోరిన టూరిజం ప్యాకేజీల సమాచారం అంద జేస్తాం. 24/7 రూమ్‌బాయ్ సేవలు ఉంటాయి.

భూమి పట్టాను తారుమారు చేశారు..!

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : తన భూమి పట్టాను తన తమ్ముడే మార్చేశాడని రాపూరు మండలం పెనుబర్తి గ్రామానికి చెందిన బొడ్డు వీరాస్వామి ఆరోపించారు. గురు వారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ తమ గ్రామం కండలేరు ముంపు పల్లె కావడంతో 1999లో ప్రభుత్వం నష్టపరిహారంగా రెండున్నర ఎకరాల పొలం ఇచ్చిందని చెప్పారు. తన తమ్ముడు చిన్నవీరాస్వామి చదువుకున్నందున మునక ప్రాంత బాధితుడిగా ఉద్యోగం ఇస్తామని ప్రభుత్వం చెప్పిందని, రెండున్నర ఎకరాల భూమిని తనకు ఇచ్చిందని తెలిపారు. అయితే తన తమ్ముడు కొందరు ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకుల సహకారంతో ఆ భూమి పట్టాను మార్చివేసి తమ కుటుంబాన్ని ఇబ్బంది పెడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

మహీంద్ర ఎలక్ట్రిక్ కారు విడుదల

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బాలాజీ ఏజెన్సీస్, ఇండస్ట్రీస్ షోరూమ్‌లో గురువారం సాయంత్రం మహీంద్రా అత్యాధునిక ఎలక్ట్రిక్ కారు మార్కెట్‌లోకి విడుదలైంది. ఆర్టీవో ఎం బాలమురళి ముఖ్య అతిథిగా హాజరై వాహనాన్ని విడుదల చేశారు. 10 వేరియంట్లలో లభించే ఈ కారు ధర రూ.20.50లక్షల నుంచి రూ.27.90 లక్షల వరకు ఉంటుందని బాలాజీ ఇండస్ట్రీస్ సీఈవో నరేంద్రనాథ్, సేల్స్ జీఎం శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వీస్ జీఎం ఉమా మహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

దర్గా అభివృద్ధి పనుల్లో కదలిక

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ప్రసిద్ధ బారాషహీద్ దర్గా అభివృద్ధి పనుల్లో కదిలిక వచ్చినట్లు సమాచారం. గత సంవత్సరం రొట్టెల పండుగ సందర్భంగా భక్తులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వర్చువల్‌గా ముఖాముఖి మాట్లాడారు. ఆ సందర్భంగా దర్గా ప్రాంతంలో నిలిచిపోయిన మసీదు నిర్మాణానికి రూ.5కోట్లు, దర్గా అభివృద్ధికి అవసరమైన నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఆ నిధుల సాధన కోసం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చేసిన కృషి ఫలితంగా దర్గా ముఖ ద్వారాల నిర్మాణానికి రూ.82.50 లక్షల నిధులు మంజూరయ్యాయి. అలాగే మసీదు నిర్మాణానికి రూ.5కోట్ల విడుదలకు వక్ఫ్‌బోర్డు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఎమ్మెల్యే కోటంరెడ్డికి మైనారిటీ నాయకుడు షంషుద్దీన్ ముస్లింల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

అంగన్‌వాడీల్లో వసతుల కల్పన

- 70శాతం పూర్తయిన మరుగుదొడ్లు, నీటివసతి
- బాల్యానికి భరోసా ఇచ్చిన కూటమి ప్రభుత్వం

మనుబోలు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మాతా,శిశు సంరక్షణకు కృషిచేసే అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలికవసతుల కల్పనకు కూటమి చర్యలు తీసుకుంది. దీంతో తాగునీరు,మరుగుదొడ్ల నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. తగినన్ని నిధులు విడుదల చేయడంతో అధికారులు పనుల్లో ప్రత్యేకశ్రద్ధ వహిస్తున్నారు. గత ఐదేళ్లలో వైసీపీ అంగన్‌వాడీల అభివృద్ధిని నిర్లక్ష్యం చేయడంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. మండలంలోని 19 పంచాయతీల్లో 50 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 8 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు నడుస్తున్నాయి. ఏ కేంద్రాల్లో మరుగుదొడ్లు, తాగునీటి వసతి లేవో గుర్తించారు. తొలివిడతలో చెరుకుమూడి, కట్టువపల్లి, కొలనుకుదురు, పిడూరుపాళెం ఎస్టీకాలనీ, పిడూరు, చెర్లోపల్లి, అక్కంపేట అంగన్‌వాడీ కేంద్రాల్లో అవసరాలను గుర్తించి గ్రాంటు ఇన్ ఎయిడ్ కింద ఒక్కో మరుగుదొడ్డికి రూ. 37వేలు మంజూరు చేశారు. అలాగే తాగునీటి వసతికోసం రూ. 17వేలు మంజూరు చేయించారు. దీంతో 7 కేంద్రాల్లోని 4కేంద్రాల్లో పనులు పూర్తిచేశారు. రూ.37వేలకు గ్రామీణ నీటిపారుదల శాఖ అధికారులు సాధారణ మరుగుదొడ్డి మాదిరిగా కాకుండా ఇళ్లల్లో నిర్మించుకునే మాదిరిగా టైల్స్, రంగులు వేసి అందంగా తీర్చిదిద్దించారు. మరుగుదొడ్లు, తాగునీటి వసతి ఏర్పాట్లుపై అంగన్‌వాడీ సిబ్బందితోపాటు కేంద్రాలకు వచ్చే చిన్నారుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



చెరుకుమూడి అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన మరుగుదొడ్డి

త్వరగా పూర్తిచేయిస్తాం

మరుగుదొడ్లు, నీటివసతి పనులు 70 శాతం వరకు పూర్తిచేయించాం. పూర్తిచేసిన పనులకు బిల్లులు మంజూరు చేయిస్తున్నాం. మిగిలిన 30 శాతం పనులను త్వరలోనే పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటాం.



- కసనానాయక్, గ్రామీణ నీటిపారుదల శాఖ ఏఈ

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి



కోనేరును పరిశీలిస్తున్న జనసేన నేతలు

వెంకటాచలం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన సమన్వయకర్త బీ. సురేష్‌నాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని సర్వేపల్లిలోని మూలస్థానే శ్వరస్వామి శివాలయాన్ని, కోనేరును గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ శివరాత్రి బ్రహ్మోత్సవాలు రానున్నాయని, వెంటనే కోనేరును శుభ్రం చేయాలన్నారు. హిందూ ధర్మ పరిరక్షణలో భాగంగా ఆలయాలు, కోనేర్లు, ఆలయ భూములను రక్షించడంలో కూటమి ప్రభుత్వం ముందుంటుందన్నారు. కార్యక్రమంలో పినిశెట్టి మల్లికార్జున్, సందూరి శ్రీహరి, వాసు, నవీన్, రవి తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి



హెల్మెట్లతో పోలీసుల ర్యాలీ

పొదలకూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ఆర్థిక స్తోమత కలిగిన ప్రతి ఒక్కరూ ఇంట్లోనూ, దుకాణంలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ శివరామకృష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని ప్రధాన కూడళ్ల, ముఖ్యమైన వీధుల్లో దాతల సహాయంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సీసీ కెమెరాల సాయంతో నేరాలను తగ్గించవచ్చని తెలిపారు. అనంతరం జాతీయ భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మీడియా ప్రతినిధులకు హెల్మెట్‌లు అందజేశారు. తదుపరి పోలీసుస్టేషన్ వద్ద నుంచి రామ్‌గేట్ సెంటర్, సంగం రోడ్డు కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ హనీఫ్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువలో చెత్త తొలగింపు

మనుబోలు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పైర్లకు సాగునీరందక రైతులు ఇబ్బందులు పడుతుండడంతో మనుబోలు సాగునీటి సంఘం అధ్యక్షుడు పచ్చిపాల రామిరెడ్డి స్పందించారు. మనుబోలు చెరువుకు కండలేరు నుంచి నీటిని విడుదల చేయించాలని ఎమ్మెల్యేను కోరారు. విడుదల చేసిన నీరు రాలేదు. దీంతో సాగునీటి కాలువను పరిశీలించగా వీరంపల్లి బేరు వద్ద కాలువ దెబ్బతిని, కాలువలో చెత్త, రాళ్లు పడి అడ్డుగా చెక్కలు దిగిపోయి ఉన్నవి. దీంతో గురువారం ఎస్కవేటర్ సాయంతో వాటిని తొలగించి పారుదలకు అడ్డంకులు తొలగించారు. రెండురోజుల్లోనే చెరువుకు సాగునీరు చేరుందని పచ్చిపాల తెలిపారు. కార్యక్రమంలో మనుబోలు విజయా డెయిరీ కేంద్రం అధ్యక్షుడు పచ్చిపాల శ్రీకాంత్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రూ.1.3కోట్లతో తాగునీటి ట్యాంకు నిర్మాణం



ట్యాంకు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్‌శాఖ అధికారులు

మనుబోలు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): గ్రామ ప్రజల తాగునీటి దాహార్తి తీర్చేందుకు రూ. 1.03కోట్లతో మనుబోలులో తాగునీటి ట్యాంకును ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రెడ్డయ్య తెలిపారు. గురువారం ఆయన మనుబోలులో జరుగుతున్న ట్యాంకు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జల జీవన్ నిధులతో ఈ నిర్మాణం చేపట్టామన్నారు. మనుబోలు పొలాల్లో పాయింట్ ఏర్పాటు చేశామన్నారు. జూన్‌లోగా నిర్మాణం పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నాణ్యత లేకుండా నిర్మాణాలు చేయవద్దని ఈఈ కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. కార్యక్రమంలో డీఈ ఐ.వెంకటేశ్వర్లు, ఏఈ. కసనానాయక్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు శిక్షణ

వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్ వద్ద గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్‌బీ, పఢైబీ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ పిల్లల చదువు, విద్యా నైపుణ్యం పెంపొందించుట, ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సీడీపీవో వీ. విజయలక్ష్మి, సూపర్‌వైజర్ సీహెచ్ వీ.భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



తిరుమలలో 'తండేల్' బృందం

ఇటీవల విడుదలై విజయాన్నందుకున్న తండేల్ సినిమా బృందం గురువారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుంది. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో దర్శకుడు చందు మొండేటితో పాటూ నిర్మాత అల్లు అరవింద్, బన్నీవాసు, హీరో నాగచైతన్య, హీరోయిన్ సాయిపల్లవి తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయం వెలుపల సినిమా దర్శకుడు చందు మొండేటి మీడియాతో మాట్లాడారు. 'దయచేసి పైరసీలో 'తండేల్' సినిమాను ఎవ్వరు చూడద్దు. పైరసీలో చాలా ఎమోషన్స్ అర్థం కావు. థియేటర్‌కు వచ్చి చూడండి తేడా అర్థమవుతుంది.' అని ప్రేక్షకులకు విజ్ఞప్తి చేశారు. విడుదలకు ముందు నిర్మాత బన్నీవాసు తిరుమలకు వచ్చి అఖండ విజయాన్నివ్వాలని కోరుకున్నారని, స్వామి కరుణించాడని చెప్పారు.అందుకే మొక్కు తీర్చుకునేందుకు వచ్చామన్నారు.

– తిరుమల, ఆంధ్రజ్యోతి

ప్రేమ సందడి

ప్రేమంటే హృదయాన్ని పారేసుకోవడం కాదు.. నువ్వు లేనప్పుడు నవ్వుని, నువ్వున్నప్పుడు కాలాన్ని పారేసుకోవడం అంటాడో కవి..రెండు అక్షరాల ఈ పదం రెండు మనసులను దగ్గర చేస్తుంది.. రెండు జీవితాలను ముడివేస్తుంది. యవ్వనంలో అడుగుపెడుతున్న..పెట్టిన వారిని ఈ భావన గిలిగింతలు పెడుతుంది. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనాలు.



6లో

ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో మన జిల్లా ఎక్కడుంది? ఏయే శాఖల్లో ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయి. ఇలా సమస్యలపై వచ్చే అర్జీల్లో మన జిల్లా స్థానం ఎంత?

- ఇలా గతేడాది జూన్ 15వ తేదీ నుంచీ ఈనెల 6వ తేదీ వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదికతో పాటు వివిధ కార్యక్రమాల్లో అందిన సమస్యలపై ప్రభుత్వం విశ్లేషించింది. శాఖల వారీగా అర్జీలను 'లెక్క'కట్టింది. పరిష్కార చర్యలపై దృష్టి పెట్టింది. దీనిపై ఈనెల 11న మంత్రులు, వివిధ శాఖల కార్యదర్శులతో సీఎం చంద్రబాబు అమరావతిలో సమీక్షా సమావేశం నిర్వహించారు. మన జిల్లాకు సంబంధించి వివరాలను పరిశీలిస్తే..

– తిరుపతి, ఆంధ్రజ్యోతి



ఇతర శాఖల్లో నాలుగో స్థానం

హౌసింగ్‌కు సంబంధించి 359 ఫిర్యాదులు ప్రభుత్వానికి అందాయి. వ్యవసాయశాఖ పరంగా 170, పౌర సరఫరాలకు సంబంధించి 410, మున్సిపల్ పరిపాలనా శాఖ పరంగా 1002, పంచాయతీరాజ్ శాఖ పరంగా 1235, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖకు 303, సెర్ప్‌కు సంబంధించి 155 చొప్పున సమస్యలపై ప్రజలు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుల సంఖ్య పరంగా జిల్లా నాలుగో స్థానంలో ఉంది.

23 వేల కుటుంబాల నుంచీ వినతులు

జిల్లాలో 23 వేల కుటుంబాలు ఏదో ఒక సమస్యతో ఇబ్బంది పడుతూ పరిష్కారం కోరుతూ ప్రభుత్వానికి వినతులు పంపుకున్నట్టు తాజా విశ్లేషణ వెల్లడిస్తోంది. హౌస్ హోల్డ్ గ్రీవెన్స్ డిస్ట్రిబ్యూషన్ పేరిట ప్రభుత్వం రాష్ట్ర స్థాయిలో జరిపిన విశ్లేషణతో ఈ అంశాలు వెలుగు చూశాయి. జిల్లాకు సంబంధించి 23,047 కుటుంబాలు కనీసం ఒక సమస్య చొప్పున ఎదుర్కొంటున్నాయి. ఈ కుటుంబాల సంఖ్య పరంగా చూస్తే జిల్లా ఐదవ స్థానంలో నిలిచింది. రెండు మూడు సమస్యలు ఎదుర్కొంటూ ఫిర్యాదులు చేసిన కుటుంబాలైతే 4085 ఉన్నాయి. ఈ కేటగిరీలో జిల్లా 8వ స్థానంలో ఉంది. 371 కుటుంబాలు నాలుగైదు సమస్యలతో సతమతమవుతూ ప్రభుత్వానికి ఫిర్యాదులు చేశాయి. ఇందులో జిల్లాది తొమ్మిదవ స్థానం. ఆరు నుంచీ పది సమస్యలు భరిస్తూ ప్రభుత్వానికి వినతులు పంపిన కుటుంబాలు 118 వుండగా.. ఈ అంశంలో జిల్లా స్థానం పది. పదికి పైగా సమస్యలు ఎదుర్కొంటూ ఫిర్యాదులు పంపిన కుటుంబాలు 33 ఉన్నాయి. ఈ విషయంలో జిల్లా పదో స్థానంలో నిలిచింది.

19.46 / 20

ప్రజా సమస్యల పరిష్కారంలో జిల్లా సాధించిన పాయింట్లు

- ఏడు నెలల్లో 32 వేలకు పైగా ముఖ్య శాఖల ఫిర్యాదులలో 8వ స్థానం
- ఇతర శాఖలకు నాలుగో స్థానం

ప్రజా ఫిర్యాదుల్లో 8వ స్థానం

ప్రజా సమస్యల పరిష్కార వేదికతో పాటు వివిధ కార్యక్రమాల కింద 32,780 ఫిర్యాదులు అందాయి. ఈ సంఖ్య పరంగా జిల్లా 8వ స్థానంలో నిలిచింది. రాయలసీమను దృష్టిలో పెట్టుకుని పరిశీలిస్తే చిత్తూరు, కర్నూలు, అన్నమయ్య జిల్లాల తర్వాత తిరుపతిలోనే అత్యధికంగా ప్రజా ఫిర్యాదులు అందాయి. వీటిలో సింహ భాగం రెవెన్యూ శాఖవే. మొత్తం 32,780 ఫిర్యాదుల్లో.. ఒక్క రెవిన్యూ సీసీఎల్ఏకు సంబంధించినవే 22,461 ఉన్నాయి. రెవెన్యూ శాఖలోనే విడిగా సర్వే సెటిల్‌మెంట్స్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ సమస్యలపై 13,786 ఫిర్యాదులు అందాయి. సహజంగానే తిరుపతి జిల్లాలో భూ వివాదాలు ఎక్కువగా ఉండటంతో పాటు గత వైసీపీ ప్రభుత్వంలో భూ కబ్జాలు, రికార్డుల తారుమారు వంటి వ్యవహారాలు అధికంగా చోటు చేసుకోవడంతో వీటిపైనే ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని తెలుస్తోంది.

కీలక, పోలీసు శాఖల్లో..

రాష్ట్రం మొత్తం మీద కీలక శాఖలు, పోలీసు శాఖకు సంబంధించి తిరుపతి జిల్లాలోనే ప్రజలు అత్యధికంగా ప్రభుత్వానికి ఫిర్యాదులు చేశారు. కీలక శాఖల పరంగా అన్నమయ్య, తిరుపతి జిల్లాల నుంచీ ఎక్కువగా ఫిర్యాదులు నమోదయ్యాయి. అదే పోలీసు శాఖకు సంబంధించి పార్వతీపురం మన్యం, తిరుపతి జిల్లాల్లోనే ప్రజలు ఎక్కువగా ఫిర్యాదు చేశారు. ఈ జిల్లా నుంచీ 1878 ఫిర్యాదులు ప్రభుత్వానికి వెళ్లాయి.

సీఎంవోకు అందిన ఫిర్యాదుల్లో నాలుగో స్థానం

సీఎం దృష్టికి వెళితే సమస్యలు పరిష్కారమవుతాయని ఆశిస్తూ పలువురు ముఖ్యమంత్రి కార్యాలయానికే ఫిర్యాదులు చేస్తున్నారు. ఇలా సీఎంవోకు మన జిల్లా నుంచి 935 ఫిర్యాదులు అందాయి. ఎన్టీయార్ విజయవాడ, గుంటూరు, అన్నమయ్య జిల్లాల తర్వాత నాలుగో స్థానంలో మన జిల్లా నిలిచింది.

ఇదీ జిల్లా స్కోర్ బోర్డు

గతేడాది జూన్ 15 నుంచీ ఫిబ్రవరి 6వ తేది వరకు ప్రజల నుంచీ అందిన ఫిర్యాదుల సంఖ్య, వాటి పరిష్కారాల శాతం ఆధారంగా జిల్లాలకు ప్రభుత్వం పాయింట్లు ప్రకటించింది. ఆ స్కోర్ బోర్డులో మొత్తం వంద పాయింట్లు ఉండగా వాటిని 20 పాయింట్లు చొప్పున ఐదు అంశాల నడుమ విభజించింది. జిల్లాకు సంబంధించి మొత్తం వచ్చిన ఫిర్యాదుల పరంగా 7.07 పాయింట్లు, పరిష్కారానికి సంబంధించి 19.46 పాయింట్లు, పరిష్కారం తాలూకూ నాణ్యతకు 12.87 పాయింట్లు, ఎమ్మెల్యేలు, మంత్రులు, డిప్యూటీ సీఎం, సీఎం తదితర ముఖ్యుల ద్వారా అందిన ఫిర్యాదుల పరిష్కారం విషయంలో 17.71 పాయింట్లు, ఆ పరిష్కారాల తాలూకా నాణ్యతకు 7.81 పాయింట్లు చొప్పున లభించాయి. ఇవే అంశాలకు సంబంధించి కేవలం గత నెలలో మాత్రమే పరిశీలిస్తే వరుసగా 3.31, 19.30, 9.76, 17.94, 7.54 పాయింట్లు చొప్పున లభించాయి.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ శ్రీలత, డాక్టర్ శోభామణి, డాక్టర్ నాగేశ్వరరావు

బర్డ్‌ఫ్లూపై ఆందోళన చెందొద్దు

- చికెన్, గుడ్లు బాగా ఉడికించి తినొచ్చు
- వెటర్నరీ వర్సిటీ డీఆర్ డాక్టర్ శ్రీలత


తిరుపతిరూరల్, ఫిబ్రవరి13 (ఆంధ్రజ్యోతి): బర్డ్‌ఫ్లూపై ఎలాంటి ఆందోళన వద్దని, బాగా ఉడికించిన చికెన్‌మీట్, కోడిగుడ్లను నిర్భయంగా తినొచ్చని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్(డీఆర్) ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ శ్రీలత స్పష్టం చేశారు. వర్సిటీలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇటీవల ఉభయగోదావరి జిల్లాల్లో బర్డ్‌ఫ్లూ ఎక్కువ కావడంతో చికెన్, కోడి గుడ్లు తినొచ్చో లేదోనన్న సంశయంలో జనం ఉన్నారన్నారు. ఈ వ్యాధి బర్డ్ నుంచి బర్డ్‌కి వ్యాపిస్తుందేగానీ బర్డ్ నుంచి మనుషులకు సోకదని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు దేశంలో బర్డ్‌ఫ్లూ వల్ల మనుషులు మరణించిన దాఖలాలు లేవన్నారు. దీనికి టీకా (వ్యాక్సిన్) లేనందున నివారణ చర్యలు మాత్రమే చేపట్టాలని సూచించారు.

వ్యాధి లక్షణాలు

బర్డ్‌ఫ్లూ సోకిన కోళ్ల కళ్లు, ముక్కుల నుంచి ద్రవాలు కారడం, తలవాపు, మెడ, కాళ్లు వంకరపోవడం, నరాల సంబంధిత లక్షణాలుంటాయని శ్రీలత వివరించారు. వీటిని చూసిన రైతులు సంబంధిత వైద్యాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. 'చనిపోయిన కోళ్లను గుంతలు తీసి సామూహికంగా పూడ్చిపెట్టి దానిపై బ్లీచింగ్ చల్లాలి. కుక్కలు, ఇతర జంతువులు ఈ మట్టిని తవ్వకుండా ముళ్ల కంప వేయాలి. ఈ విషయంలో నిర్లక్ష్యంగా ఉంటే మిగతా కోళ్ల మరణాల శాతం ఎక్కువగా ఉంటుంది. కోళ్ల ఫారాల్లో సిబ్బందికి పీపీఈ కిట్లు, క్లోరినేటెడ్ మందులను వినియోగించాలి. ఫారాల్లోకి వచ్చే వాహనాలను స్టెరిలైజ్ చేయాలి. వలస పక్షులు రాకుండా చూడాలి' అని ఆమె వివరించారు. ఈ మీడియా సమావేశంలో డీఈ డాక్టర్ శోభామణి, డెయిరీ డీన్ డాక్టర్ నాగేశ్వరరావు, వివిధ విభాగాల ప్రొఫెసర్లు డాక్టర్ ఆనందరావు, డాక్టర్ రాజేశ్వరీమేల, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ జీఆర్ కే శర్మ తదితరులు పాల్గొన్నారు.

వ్యాప్తి ఇలా..

ఉష్ణోగ్రతలు తక్కువగా ఉన్నప్పుడు ఏవియన్ ఇన్‌ఫ్లూయెంజా వైరస్ ద్వారా బర్డ్ ఫ్లూ సోకుతుందని శ్రీలత తెలిపారు. వలస పక్షులు, కంటామినేటెడ్ ఫీడ్ అండ్ వాటర్ ద్వారా ఒకదాని నుంచి మరో దానికి వ్యాప్తి చెందుతుందన్నారు. కోళ్ల సాంద్రత ఎక్కువగా ఉన్న చోట వ్యాధి త్వరగా వ్యాపిస్తుందన్నారు. అధిక ఉష్ణోగ్రతల్లో (34-35డిగ్రీలు) వైరస్ మనుగడ (జీవనం) సాగించదని తెలిపారు.



నాగలాపురం బ్యాంకులో

కొనసాగుతున్న విచారణ

నాగలాపురం, ఫిబ్రవరి 13, (ఆంధ్రజ్యోతి): నాగలాపురంలోని ఓ బ్యాంకులో ఉద్యోగి చేతి వాటాన్ని ప్రదర్శించి రూ.2 కోట్ల మేర నగలు గోల్‌మాల్ చేసిన వ్యవహారంపై విచారణ కొనసాగుతోంది. ఈ వ్యవహారం గురించి 'నాగలాపురంలో లక్కీభాస్కర్' శీర్షికన ఆంధ్రజ్యోతిలో గురువారం బయటపెట్టిన విషయం తెలిసిందే. ఈ అక్రమాలపై బ్యాంకులో ఉన్నతాధికారుల బృందం విచారణ లోతుగా జరుపుతున్నట్లు తెలుస్తోంది. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్టు సమాచారం. దీనిపై బ్యాంకు అధికారులను వివరణ కోరగా.. బ్యాంకులోని నగలు భద్రంగా ఉన్నాయంటూ పొంతనలేని సమాధానం చెబుతూ అసలు విషయాలను దాటవేసే ప్రయత్నం చేశారు. కాగా నగల వ్యవహారంపై పోలీసులను కూడా బ్యాంకు అధికారులు సంప్రదించినట్లు సమాచారం. న్యాయ నిపుణుల సలహా మేరకు ఈ ఘటనపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలన్న అంశంపై యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

బ్యాంకు అధికారులపై వేటు

నగల గోల్‌మాల్ వ్యవహారంలో పలువురు బ్యాంకు సిబ్బందిపై వేటుపడే అవకాశమున్నట్లు కనిపిస్తోంది. ఇందులో భాగంగా బ్యాంకులో కీలకంగా ఉన్న ఇద్దరిలో ఒకరిని ఇప్పటికే సస్పెండ్ చేసినట్లు, తాజాగా మరొకరిని కూడా విధుల నుంచి దూరం పెట్టినట్లు తెలిసింది. ఈ ఘటనలో వీరి ప్రమేయం ఎంత వరకు ఉంది, ఏమేరకు అక్రమాలకు పాల్పడ్డారన్న విషయంపై ముమ్మరంగా విచారణ జరుపుతున్నారు. ఈ విచారణ మరో మూడు రోజులు కొనసాగుతుందని, పూర్తయిన వెంటనే మీడియాకు వెల్లడిస్తామని బ్యాంకు అధికారులు తెలిపారు.

బాలాజీ రిజర్వాయరుపై కసరత్తు

- ఏపీ జలవనరులశాఖ సలహాదారు కన్నయ్య నాయుడు



పాపవినాశనం జలాశయ గేట్లను పరిశీలిస్తున్న కన్నయ్య నాయుడు

తిరుమల, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): 'కృష్ణా నీటిని కుప్పం వరకు తీసుకువచ్చేలా చాలా ప్రతిపాదలను పెట్టాం. మధ్యలో చాలా బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు వచ్చాయి. ప్రభుత్వ నిధులను బట్టి ఒక్కొక్కటిగా నిర్మాణం చేపడుతూ వస్తోంది. వీటిలో బాలాజీ రిజర్వాయర్ కూడా ప్రాధాన్యంలో ఉంది. దీనికి అధికారులు కసరత్తు చేస్తున్నారు' అని ఏపీ జనవరులశాఖ సలహాదారు కన్నయ్య నాయుడు తెలిపారు. తిరుమలలోని పాపవినాశనం, గోగర్భం డ్యామ్‌ల పటిష్ఠత, గేట్లను తన బృందంతో కలిసి గురువారం పరిశీలించిన ఆయన 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రభుత్వం నిధులు కేటాయిస్తే ప్రాజెక్టులు త్వరగా పూర్తవుతాయన్నారు. ఇక, తిరుమలలో నీటి సమస్య లేకుండా చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కాళంగి ప్రాజెక్ట్ సామర్థ్యాన్ని 0.2 టీఎంసీ నుంచి 2 టీఎంసీలకు పెంచేందుకు సర్వే పూర్తయిందన్నారు. ఇందులో నాలుగు గ్రామాల్లో భూసేకరణ పూర్తయితే జలాశయం అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ నీటిని తిరుపతికి వాడుకుంటే.. నగర సమీపంలోని అన్ని డ్యాముల నీటిని తిరుమలకు తీసుకెళ్లడం ద్వారా భక్తులకు నీటి ఇబ్బందులు ఉండవన్నారు.

పోలీసు శాఖలో ప్రక్షాళన!

- తొలి దశలో స్పెషల్ బ్రాంచ్‌పై దృష్టి పెట్టిన ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో ప్రక్షాళన దిశగా ఎస్పీ హర్షవర్ధనరాజు చర్యలు చేపట్టారు. మొదటగా స్పెషల్ బ్రాంచ్‌పై దృష్టి పెట్టారు. ఈ క్రమంలో సీఐ శ్రీనివాసులును తిరుపతి ట్రాఫిక్‌కు నియమిస్తూ గురువారం అటాచ్‌మెంటు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు మెడికల్ సెలవుపై ఉన్న షాదిక్ ఆలీని స్పెషల్ బ్రాంచ్ సీఐగా నియమించారు. ఇక, మిగతా అధికారులు, సిబ్బంది బదిలీలపై దృష్టి పెట్టనున్నారు. ప్రధానంగా రాజకీయ పరిణామాలు, ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు, పేకాట తదితర అంశాలపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావడంలో కొందరు స్పెషల్ బ్రాంచ్ పోలీసులు విఫలమయ్యారయే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో తిరుపతి ఎస్పీలోని మరో కీలక అధికారి బదిలీ జరిగే అవకాశముందని పోలీసు వర్గాల్లో వినిపిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఎస్బీలో పనిచేస్తున్న కానిస్టేబుళ్ల తీరుపైనా తీవ్రస్థాయిలో విమర్శలు.. ఫిర్యాదులు ఉన్నాయి. ఇప్పటికే ఒకసారి హెచ్చరించిన ఎస్పీ.. ప్రస్తుతం చర్యలకు దిగుతున్నట్లు తెలుస్తోంది. శ్రీకాళహస్తి సబ్ డివిజన్ పరిధిలోని ఓ స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ ఇసుక మాఫియాకు.. మరికొందరు కోడి పందేల నిర్వాహకులకు సహకరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. పెద్ద హోటళ్ల యజమానులతో ఒప్పందం కుదుర్చుకుని విమానాశ్రయంలోని కొందరు ట్రావెల్స్ నిర్వాహకులతో టైఅప్ చేసుకుని తిరుమల, శ్రీకాళహస్తి, కాణిపాకం ఆలయాల్లో దర్శనాలు చేయిస్తానంటూ ఓ కానిస్టేబుల్ వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఓ ఎస్బీ కానిస్టేబుల్‌కు బంధువులైన ఇద్దరు కానిస్టేబుళ్లపైనా ఆరోపణలున్నాయి. వీరిలో ఒకరు ఇసుక మాఫియాతో చేతులు కలిపినట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో హైవే పెట్రోలింగ్‌లో పనిచేసిన కానిస్టేబుల్‌పైనా ఫిర్యాదులున్నాయి. తూర్పు మండలాల్లోని ఓ పోలీసు అధికారి లారీలు పెట్టుకుని చెన్నై, కోయంబేడు, తిరువళ్లూరు, తిరుత్తణికి ఇసుక తరలిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఓ అధికారి కార్యాలయంలో పనిచేస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లు.. ఆ అధికారి పేరు చెప్పుకొని సెటిల్‌మెంట్లు, ఆర్థిక దందాలు, భూ సమస్యలు, భార్యాభర్తల తగాదాల్లో తలదూర్చి నిందితులకు కొమ్ముకాస్తున్నారని సమాచారం. వీటన్నింటిపైనా దృష్టి పెట్టిన ఎస్పీ.. ప్రక్షాళనదిశగా చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తోంది.

ఎంసీఏ, ఎల్ఎల్‌బీ ఫలితాల విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో నిర్వహించిన ఎంసీఏ, ఎల్ఎల్‌బీ (3, 5 ఐదేళ్ల కోర్సుల) నాల్గవ సెమిస్టర్ ఫలితాలు విడుదలయ్యాయి. ఈ మేరకు సీఈ దామ్లానాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

గుంపులుగా వెళ్లండి

నడకమార్గంలో ఫారెస్ట్ సిబ్బంది



- చిరుత కలకలం నేపథ్యంలో భక్తులను అప్రమత్తం చేసిన అధికారులు

తిరుమల, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): అలిపిరి నడక మార్గంలోని ఏడోమైలు ముగ్గుబావి వద్ద గురువారం రాత్రి చిరుత కనిపించిందన్న భక్తుల కేకలతో అధికారులు అప్రమత్తమయ్యారు. విజిలెన్స్, ఫారెస్ట్ అధికారులు అక్కడికి చేరుకున్నారు. చిరుత అడవిలోకి వెళ్లిపోయిందని నిర్ధారించుకున్నాక భక్తులను గుంపులుగుంపులుగా అనుమతించారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు భద్రతను కట్టుదిట్టం చేశారు.

ముక్కంటి ఆలయ హుండీ ఆదాయం రూ.2.04కోట్లు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం హుండీ లెక్కింపు జరిగింది. స్వామి అమ్మవార్ల గర్భాలయాల వద్ద ప్రధాన హుండీలతో పాటూ పరివార దేవతల హుండీలను గురువారం ఉదయం ఆలయంలో లెక్కించారు. మొత్తం 40 రోజులకు రూ.2.04కోట్లు ఆదాయం వచ్చినట్టు అధికారులు చెప్పారు. డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 16 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు,నారాయణగిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

మంగళవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.37 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,270

తలనీలాలు సమర్పించినవారు: 22,175

మార్కెట్‌లో ప్రేమ సందడి





గుప్పెడంత గుండెలోని కొండంత ప్రేమను వ్యక్తం చేయాలి. మనసులో ప్రేమ గిలిగింతలు పెడుతున్న అమ్మాయి హృదయాన్ని గెల్చుకోవాలి. ఇందుకోసం అందమైన నాలుగు మాటలు, పదాలను పోగేసి కవిత చెబితే సరిపోతుందా..చాలదంటున్నారు ఈతరం ప్రేమికులు.. గుర్తుంచుకునేలా శుక్రవారం వేలెంటైన్స్ డేను సెలబ్రేట్ చేసుకోవాలనుకుంటున్నారు. వీరి మనసులోని భావాలను వ్యాపారంగా మార్చుకోడానికి మార్కెట్లు సిద్ధమయ్యాయి. ఇప్పటికే తిరుపతి నగరంలోని పలు గిఫ్ట్,ఫ్యాన్సీ షాపుల్లో ప్రేమికుల సందడి కనిపిస్తోంది. రకరకాల కేకులు,పుష్పాలు, బహుమతులు కొనుగోలుకు లవర్స్ సిద్ధమవుతున్నారు.



అపరంజి.. సుజాత

కాలిటి ప్రేమైక కుటుంబం



ప్రేమ పెళ్లిళ్లు చేసుకున్న అపరంజి సంతానం

ప్రేమంటే గుర్తుకు రావడం కాదు..జీవితాంతం గుర్తుంచుకోవడం అంటారు. పుత్తూరు పట్టణంలో అపరంజి కుటుంబాన్ని చూస్తే ఈ మాటలు అక్షరసత్యాలు అనిపించకమానదు. చాలామంది ప్రేమలు ప్రేమించడం అనే గడప దగ్గరే ఆగిపోతాయి. కానీ అపరంజి అలా కాదు. మనసిచ్చిన వారితోనే మనువు అని బలంగా విశ్వసించారు. ఒకసారి ఆయన ప్రేమ వివరాలు తెలుసుకుంటే.. దళిత సామాజికవర్గానికి చెందిన అపరంజి పేదరికంతో అష్టకష్టాలు పడ్డారు. డిగ్రీ పూర్తి చేశారు. ముద్దుకృష్ణమనాయుడు సిఫార్సుతో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చిరుద్యోగిగా చేరారు. అంచలంచెలుగా ఎదిగి హిందీ అధ్యాపకుడు స్థాయికి చేరుకున్నారు. జూనియర్ కళాశాలలో పని చేస్తున్న సమయంలో అక్కడ అగ్రవర్ణానికి చెందిన సుజాతతో పరిచయమేర్పడింది. అది ప్రేమగా మారింది. కులాలు మతాలు అడ్డువచ్చినా కాదని తోసిపుచ్చారు. ప్రేమపక్షానే నిలిచారు. పెద్దల నుంచి అభ్యంతరాలు ఎదురయ్యాయి. కానీ తాము పెళ్లితో ఒక్కటవుతామని పోలీసులు, పెద్దలకు తెగేసి చెప్పారు. ధైర్యంగా తిరుమలలో పెళ్లిపీటలెక్కారు. సమాజ ఆటు పోట్లకు వెరవకుండా కలిసి జీవితం సాగించారు. సుజాత ముగ్గురు పిల్లలు పుట్టిన తర్వాత భర్తకు చేదోడువాదోడుగా ఉండాలని సంకల్పించింది. టీచర్ ట్రైనింగ్ పూర్తి చేసింది. ప్రభుత్వ టీచరుగా ఎంపికైంది. పిల్లలు సాయిలక్ష్మి, దివ్యశ్రీ, సాయిప్రకాష్‌లను ఈదంపతులు బాగా చదివించారు. తాము అనుభవించిన ఇబ్బంది మరొకరికి ఎదురుకాకూడదని పెళ్లి విషయంలో పిల్లలకు స్వేచ్ఛనిచ్చారు. ముగ్గురు పిల్లలు సహోద్యోగులను ప్రేమించారు. దీంతో వీరంతా ప్రేమ వివాహాలే చేసుకున్నారు. వీరి కుటుంబంలో రెండోతరం ప్రేమ వారసులుగా నిలిచారు. - పుత్తూరు, ఆంధ్రజ్యోతి





కుమార్తెలు యక్షకుమారి, లిఖితలతో పురుషోత్తం, కృష్ణకుమారి దంపతులు

'ప్రేమ'యుద్ధంలో గెలిచారు

పురుషోత్తం, కృష్ణకుమారిల్లో చిన్నప్పుడు చిగురించిన స్నేహం ఎదిగేకొద్దీ ప్రేమ పుష్పమై వికసించింది. పెద్దయ్యాక అయినవారు కాదన్నా ఒప్పించి ఒక్కటయ్యారు. నాయుడుపేటకు చెందిన పురుషోత్తం, కృష్ణకుమారీల మధ్య ఏడో తరగతి చదువుతున్నప్పుడు స్నేహం ఏర్పడింది. తరువాత ఇంటర్మీడియట్‌లో వేర్వేరు గ్రూపులు తీసుకున్నా కలిసే చదివారు. డిగ్రీ కళాశాలలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. 14 సంవత్సరాల వారి స్నేహం ప్రేమగా మారింది. 2002 సెప్టెంబరులో పురుషోత్తం ఇండియన్ ఆర్మీలో సోల్జర్‌గా ఎంపికయ్యాడు. ఈనేపథ్యంలో వీరి ప్రేమ వ్యవహారం ఇరు కుటుంబాలకు తెలిసింది. కృష్ణవేణి కుటుంబసభ్యులు అభ్యంతరం తెలియజేశారు. అయినప్పటికీ కృష్ణవేణి రెండేళ్లపాటు పెళ్లిచూపులు వాయిదావేస్తూ వచ్చింది. పురుషోత్తం వచ్చి తన మెడలో మూడుముడులు వేస్తాడని విశ్వసించింది. మిలటరీ ట్రైనింగ్ పూర్తి చేసుకున్నాక స్వస్థలానికి వచ్చారు. కృష్ణకుమారి తల్లిదండ్రులను, కుటుంబసభ్యులను ఒప్పించడంలో సఫలమయ్యారు. 2004 మే9న కృష్ణకుమారిని పెళ్లి చేసుకున్నారు. 2018 ఆగస్టు 31నపురుషోత్తం ఆర్మీలో హవల్దార్ హోదాలో రిటైరయ్యారు. ప్రస్తుతం ఆయన గ్రీన్‌టెక్ పరిశ్రమలో పనిచేస్తున్నారు.

- నాయుడుపేట, ఆంధ్రజ్యోతి

ప్రాణం తీసిన బనియన్

- తీసే క్రమంలో మెడకు బిగుసుకుని బాలుడి మృతి



తడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఒంటిపై ఉన్న బనియన్‌ను తీసే క్రమంలో అది మెడకు బిగుసుకుపోవడంతో ఓ బాలుడు మృతిచెందాడు. తడ మండలం రామాపురం పంచాయతీ వెంకటాద్రి పాళెం గ్రామానికి చెందిన శరణేష్ (13) గురువారం ఇంటివద్ద స్నానం చేసేందుకు వెళ్లాడు. ఆ సమయంలో బనియన్‌ను తీస్తుండగా అది ఓ పక్క మెడకు, మరోపక్క దుస్తులను తగిలించే స్టాండ్‌కు తగులుకుంది. ఊపిరి అందక అక్కడికక్కడే మృతిచెందాడు. స్నానానికి వెళ్లిన బాలుడు అరగంట అయినా రాకపోయే సరికి కుటుంబ సభ్యులు తలుపులు బద్దలుకొట్టి చూడగా చనిపోయి ఉన్నాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పనిచేయని సర్వర్లతో ఆగిన రిజిస్ట్రేషన్లు



మూసి ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

కోట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : కోట సబ్ రిజిస్ట్రార్ కార్యాల యంలో గురువారం సర్వర్లు పనిచేయకపోవడంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఆగిపోయింది. ఉదయం నుంచి కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాలకు చెందిన రైతులు, వ్యాపారస్తులు భూములు, ఇల్లు రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు వచ్చారు. సర్వర్లు మొరాయించడంతో సిబ్బంది చేతులు ఎత్తేశారు. దీంతో చేసేదిలేక ఆయా మండలాల రైతులు, వ్యాపారులు నిరాశతో వెనుదిరిగారు.

పరిశ్రమల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం

తిరుపతి (కలెక్టరేట్), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మీనాక్షి కంపెనీ (వేదాంత పవర్), సింహపురి జిందాల్ కంపెనీ, నవయుగ కంపెనీ ప్రతినిధులతో కలెక్టర్ వెంకటేశ్వర్ గురువారం సమన్వయ సమావేశం నిర్వహించారు. సంబంధిత మ్యాప్‌లను పరిశీలించారు. ఎన్‌హెచ్ఏఐ నెల్లూరు వారితో పలు అంశాలపై చర్చించారు. జిల్లాలో పెట్టుబడులు పెట్టడానికి ఎంతో అనువైందని, తమ వంతు సహకారం అందిస్తామని పరిశ్రమలు ప్రతినిధులకు కలెక్టర్ హామీ ఇచ్చారు. ఏపీ ఐఐసీ జెడ్ఎం నెల్లూరు శివకుమార్ పాల్గొన్నారు.

16న మంత్రి లోకేశ్ రాక

తిరుపతి (కలెక్టరేట్), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ఈనెల 16 ఉదయం 9.20 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారు రోడ్డు మార్గాన నెల్లూరు వెళ్లి మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు మనవడి వివాహానికి హాజరవుతారు. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు మళ్లీ విమానాశ్రయానికి చేరుకుని హైదరాబాదు వెళ్లనున్నారు.

జనసేన నేత కిరణ్‌రాయల్‌పై చీటింగ్ కేసు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) తిరుపతి నగర జనసేన ఇన్‌చార్జి కిరణ్‌రాయల్‌పై యూనివర్శిటీ పోలీసులు గురువారం రాత్రి చీటింగ్ కేసు నమోదు చేశారు. సీఐ రామయ్య కథనం మేరకు.. ఇటీవల కిరణ్‌పై వివిధ రకాల ఆరోపణలు, విమర్శలు చేసిన లక్ష్మీరెడ్డి రెండు రోజుల క్రితం కిరణ్‌రాయల్ ఇచ్చిన డబ్బు అడిగినందుకు తనను చంపుతానని బెదిరిస్తున్నాడని, మోసం చేసి అవమానకరంగా ప్రవర్తించాడని ఎస్వీయూ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ రామయ్య సెక్షన్ 420, 417, 506తో పాటు బీఎన్ఎస్ యాక్టు కింద కేసు నమోదు చేశారు.

వ్యవసాయ కళాశాలకు మళ్లీ బాంబు బెదిరింపు మెయిల్

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): తిరుపతి వ్యవసాయ కళాశాలకు గురువారం మళ్లీ బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. సమాచారం అందుకున్న తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు ఆధ్వర్యంలో డాగ్, బాంబు స్క్వాడ్ సిబ్బంది కళాశాలలో ముమ్మరంగా గాలించారు. ఎక్కడా బాంబులకు సంబంధించిన ఆనవాళ్లు లభించకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఐఐడీటీకి రూ.1.2 కోట్లు మంజూరు

తిరుపతి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజిటల్ టెక్నాలజీస్ (ఐఐడీటీ)కు రాష్ట్ర ప్రభుత్వం రూ.1.20 కోట్లు మంజూరు చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ పథకాలు అమలు చేసేందుకు అదర్ గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ కింద ఈ నిధులను విడుదల చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

వెటర్నరీ వర్సిటీ స్టాండింగ్ కౌన్సిల్‌గా చంద్రారెడ్డి

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీ స్టాండింగ్ కౌన్సిల్‌గా(ఏపీహైకోర్టు) అడ్వకేట్ ఆర్.చంద్రారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు లీగల్ అండ్ లెజిస్లేటివ్ అఫైర్స్ అండ్ జస్టిస్ సెక్రటరీ జి.ప్రతిభాదేవి బుధవారం నియామక ఉత్తర్వులు వెలువరించారు. మూడేళ్లపాటు ఈయన ఈ పదవిలో కొనసాగుతారు.

ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



ధ్వజస్తంభాన్ని శుభ్రం చేస్తున్న అధికారులు,అర్చకులు

చంద్రగిరి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఘనంగా కోయిల్‌ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. ఈనెల 18నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్న క్రమంలో ముందుగా ఈకార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. తెల్లవారుజామున స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగశ్రవణం నిర్వహించారు. ఉదయం 6.30 నుంచి 10.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరిగింది. ఆలయప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితరాలను నీటితో శుద్ధి చేశారు. అనంతరం సుగంధ ద్రవ్యాల పవిత్ర మిశ్రమంతో ప్రోక్షణ చేశారు. ఉదయం 11 గంటల నుంచి భక్తులకు దర్శనానికి అనుమతించారు.

పల్లెపండుగ పనులను నెలాఖరుకు పూర్తి చేయాలి

తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి గురువారం పంచాయతీరాజ్, డ్వామా అధికారులతో అభివృద్ధి పనుల పురోగతిపై వర్చువల్‌గా సమీక్షించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు, సీసీ రోడ్ల నిర్మాణంలో పురోగతి చూపాలన్నారు. పుత్తూరు, సత్యవేడు, నాగలాపురం, వడమాలపేట మండలాలు లక్ష్య సాధనలో వెనుకంజలో ఉన్నాయని, పురోగతి చూపాలని అన్నారు. డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, పీఆర్ ఈఈ, డీఈలు, ఏఈలు, ఎంపీడీవోలు, ఏపీవోలు పాల్గొన్నారు.

రేపటి నుంచి అరుణాచలం ప్యాకేజీ టూర్

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో తమిళనాడులోని అరుణాచలానికి డైలీ ప్యాకేజీ టూర్‌ను శనివారం నుంచి ప్రారంభించనున్నట్లు డివిజనల్ మేనేజర్ సి.హెచ్.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు శ్రీనివాసం నుంచి వోల్వో ఏసీ బస్సు బయలుదేరుతుందని పేర్కొన్నారు. తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు అరుణాచలంలో బయల్దేరి సాయంత్రం 5 గంటలకు వేలూరు గోల్డెన్ టెంపుల్, అక్కడి నుంచి సాయంత్రం 6 గంటలకు బయల్దేరి రాత్రి 9 గంటలకు తిరుపతి చేరుకుంటుందని వివరించారు. పెద్దలకు రూ. 1200, పిల్లలకు రూ.960 టిక్కెట్ ధర నిర్ణయించినట్లు తెలిపారు. టిక్కెట్స్‌ను ముందస్తుగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టూరిజం/ఏపీటీడీసీ.జీవోవీ.ఏపీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవచ్చునని పేర్కొన్నారు.మరిన్ని వివరాలకు 9848850099, 9848973985, 9848802099, 08772289123, 9848007033లను సంప్రదించాలని కోరారు.

సహకార సంఘాల బలోపేతానికి చర్యలు



తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల బలోపేతానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ 2025ని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో సహకార సూత్రాలు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా రూపొందించిన కార్యక్రమాలను పక్కాగా అమలుపరచాలన్నారు. టెక్నాలజీని వినియోగించి ప్రాథమిక సహకారపరపతి సంఘాలను బలోపేతం చేయనున్నట్లు వివరించారు. ప్రతి రైతూ ప్రాథమిక సహకారపరపతి సంఘాల్లో సభ్యులుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 18నుంచి 28వ తేదీ వరకు నిర్వహించే సహకార అవుట్‌రీచ్ క్యాంపెయిన్‌ని విజయవంతం చేయాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీడీఎం నాబార్డ్ సునీల్, సీఈవో జుబేదబేగం పాల్గొన్నారు.

ఫ్లెమింగో ఫెస్టివల్ విజయవంతంపై సీఎం అభినందన

- జిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దడానికి కృషిచేస్తాం
- కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) : సూళ్లూరుపేట వేదికగా గత నెలలో ఫ్లెమింగో ఫెస్టివల్-2025ను విజయవంతం చేసిన జిల్లా యంత్రాంగాన్ని సీఎం చంద్రబాబు అభినందించారు. గురువారం పర్యాటక రంగంపై వెలగపూడి సచివాలయంలో సమీక్షించిన సీఎం ఫ్లెమింగో ఫెస్టివల్ అల్బమ్‌ను విడుదల చేశారు. పుస్తకాన్ని అద్భుతంగా రూపొందించారని మంత్రి కందుల దుర్గేష్, అధికార బృందాన్ని అభినందించారు. ముఖ్యమంత్రికి కలెక్టర్ ధన్యవాదాలు తెలుపుతూ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మరిన్ని కార్యక్రమాలు చేపట్టి జిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమం విజయవంతంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.



ఫ్లెమింగో ఫెస్టివల్ అల్బమ్‌ను విడుదల చేస్తున్న సీఎం చంద్రబాబు

ఏపీపీగా బాలకృష్ణమ నాయుడు



తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన ప్రముఖ న్యాయవాది ముప్పారపు బాలకృష్ణమ నాయుడు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు. ఈయన తిరుపతి ఐదవ జిల్లా అడిషనల్ సెషన్స్ కోర్టు, ఫ్యామిలీ కోర్టులో మూడేళ్ల పాటు సేవలు అందించనున్నారు. గతంలో ఈయన అసిస్టెంట్ గవర్నమెంటు ప్లీడర్‌గా పనిచేసి ప్రభుత్వం నుంచి రెండుసార్లు ఉత్తమ సేవా పతకం అందుకున్నారు. టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడిగా, నగర లీగల్ సెల్ అధ్యక్షుడిగా సేవలు అందించారు. ఈయన సేవలను గుర్తించిన ప్రభుత్వం మరోసారి అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించింది.

సాధువుల దీక్ష విరమణ

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): అలిపిరి రోడ్డులో ఒబరాయ్ హోటల్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ రెండు రోజులుగా టీటీడీ పరిపాలనా భవనం వద్ద శ్రీనివాస ఆనంద సరస్వతి ఆధ్వర్యంలో సాధువులు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను గురువారం రాత్రి విరమించారు. అదనపు ఎస్పీ రవిమనోహరాచారి నేతృత్వంలో ఈస్ట్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ బాలకృష్ణ దీక్షా శిబిరం వద్దకు చేరుకుని వారికి నచ్చజెప్పి, నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు.



ఎస్సీ, ఎస్టీల సమస్యలు పరిష్కరించాలి

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీల సమస్యలను త్వరతగతిన పరిష్కరించేలా చొరవ చూపాలని జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ అట్రాసిటీ సభ్యుడు తాజుద్దీన్ అన్నారు. గురువారం తిరుపతిలో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోవిందనాయక్, సురేంద్రబాబు, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

గూడూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పేదలు ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ రోహిణి అన్నారు. గురువారం స్థానిక సాయిబాబా మందిరంలో లక్ష్మీశంకర్ ఆయుర్వేద ఆస్పత్రి ఆధ్వ ర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో దీర్ఘకాలిక రోగాలకు ఆయుర్వేదంలో చక్కని చికిత్సలు ఉన్నాయన్నారు. ఆయుర్వేద చికిత్సతో ఎటువంటి దుష్పరిణామాలు ఉండవన్నారు. అనంతరం డాక్టర్ శంకర్ పేదలకు వైదపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి కురుగొండ్ల నివాళి



డక్కిలి, ఫిబ్రవరి 13 : (ఆంధ్రజ్యోతి) : డక్కిలి మండలం కమ్మవారిపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన టీడీపీ నాయకులు ఈతముక్కల వెంకటసుబ్బానాయుడు కర్మక్రియలు గురువారం కమ్మవారిపల్లి జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ హాజరై వెంకటసుబ్బానాయుడు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట స్థానిక టీడీపీ నాయకులు నల్లాని రామచంద్రయ్య, రాంబాబు, కురుగొండ్ల శ్రీనివాసులు, పచ్చూరి నరసయ్య తదితరులు ఉన్నారు.

పెండింగ్ అర్జీలు పూర్తి చేయండి

వెంకటగిరిటౌన్, ఫిబ్రవరి(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న అర్జీలు త్వరగతిన పూర్తిచేయాలని గూడూరు ఆర్డీవో రాఘవేంద్ర మీనా సూచించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పెండింగ్ అర్జీలు ఎక్కువగా ఉన్నాయని వీఆర్‌వోలు 17వ తేదీలోగా వాటికి సంబంధించిన సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాంబాబు, ఆర్ఐ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

బాలాయపల్లి: ఫ్రీ హోల్డ్‌లో గుర్తించిన భూములను మళ్లీ సమీక్షించి సమగ్ర నివేదిక రూపొందించాలని బాలాయపల్లి తహసీల్దార్‌ను ఆర్డీవో ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీవో రాఘవేంద్రమీనా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఆర్టీవో కిషోర్ కుమార్

వెంకటగిరిటౌన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): వాహనదారులు ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని గూడూరు ఆర్టీవో కిషోర్ కుమార్ అన్నారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపోలో సింహపురి యూత్ అసోషియేషన్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని కోరారు. బస్సు డ్రైవర్లు విధిగా ప్రయాణికులను దృష్టిలో పెట్టుకుని జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలన్నారు. అనంతరం సిబ్బందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింహపురి యూత్ అసోసి యేషన్ అధ్యక్షుడు గుడిమెట్ల ఉదయ్‌కుమార్, డిపో మేనేజర్ రామకృష్ణ, సభ్యులు ప్రవీణ్‌కుమార్, సాయి నికేష్, రాకేష్, యూనియన్ నాయకులు రత్నం ఉదయ భాస్కర్ పాల్గొన్నారు.

నైమిషారణ్య పుణ్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు



డక్కిలి, ఫిబ్రవరి 13 : (ఆంధ్రజ్యోతి) : ఉత్తరప్రదేశ్‌లోని నైమిషారణ్య పుణ్యక్షేత్రంలో అక్కడి ప్రభుత్వం టూరిజం శాఖ, వికాస్ సరిషత్ సంయుక్తంగా నిర్వహిస్తున్న సత్యనారాణ స్వామి వ్రతంలో టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు వెంపటి మాధవ నాయుడు పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలంతా సంతోషాలతో జీవించాలని ప్రార్థించినట్లు వివరించారు.

వంశీ పాపం పండింది : తెలుగు యువత

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వల్లభనేని వంశీ పాపాలు పండాయని, అందుకే పోలీసులు అయన్ను అరెస్టు చేశారని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనందగౌడ్ పేర్కొన్నారు. నారా భువనేశ్వరిపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకే వంశీకి ఈ గతి పట్టిందని అన్నారు. వల్లభనేని వంశీ, దేవినేని అవినాష్, కొడాలి నాని రాష్ట్రానికి పట్టిన చీడ పురుగులని విమర్శించారు. మాజీ సీఎం జగన్ ప్రోద్బలంతోనే కొందరు వైసీపీ నేతలు శాంతిభద్రతలకు విఘాతం కల్గించేలా మాట్లాడుతున్నారని, అలాంటి వారు శిక్ష నుంచి తప్పించుకోలేరని స్పష్టం చేశారు.

కలెక్టర్‌ను కలిసిన ట్రెక్కింగ్ క్లబ్ సభ్యులు

తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి ట్రెక్కింగ్ క్లబ్ సభ్యులు గురువారం కలెక్టరేట్లో కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వరన్‌ను, జాయింట్ కలెక్టర్ శుభం బన్సాల్‌ను కలిశారు. సీనియర్ జర్నలిస్ట్ రాఘవ రచించిన తిరుమల దృశ్య కావ్యం, శేషాచలం కొండల్లో పుస్తకాలను అందజేశారు. ట్రెక్కింగ్ గురించి కొంతసేపు చర్చించుకున్నారు. ఈ కార్య క్రమంలో తిరుపతి ట్రెక్కింగ్ క్లబ్ ప్రధాన సభ్యుడు మధు, రాఘవ, శ్రీహరి, తిరుమల రెడ్డి, నాగిరెడ్డి, శివారెడ్డి, బుర్ర మధు, రవి, కార్తీక్, జై బాలాజీ పాల్గొన్నారు.

తడ రైల్వే స్టేషన్ ఆవరణలో వాహన స్టాండ్ ఏర్పాటు

తడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : తడ రైల్వే స్టేషన్ సమీపంలో ద్విచక్రవాహన పార్కింగ్ స్టాండ్ త్వరలో అందు బాటులో రానుంది. కొంతకాలంగా రైల్వేస్టేషన్ సమీపంలో బైక్‌లను పార్కింగ్ చేస్తుండగా అవి చోరీకి గురవుతుండటంతో వాహనదారులు నష్టపోతున్నారు. అందులో ముఖ్యంగా శ్రీసిటీ సెజ్‌లోని ఉద్యోగుల వాహనాలు ఉండటంతో విషయాన్ని శ్రీసిటీ యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన శ్రీసిటీ చెన్నై రైల్వే అధికారులకు వాహనాల పార్కింగ్ స్టాండ్ ఏర్పాటు చేయాలని కోరింది. దీంతో రైల్వే అధికారులు చెన్నైకు చెందిన ఇండియా నీడీ పీపుల్స్ చారిటబుల్ ట్రస్టుతో మూడేళ్ల పాటు స్టాండ్ ఏర్పాటు చేయడానికి ఒప్పందం కుదుర్చుకుంది. మరి కొద్దిరోజుల్లో స్టాండ్ అందుబాటులోకి రానుంది.

సంపద తయారీకేంద్రాల తనిఖీ

తడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాదలూరు, వెండ్లూరుపాడు పంచాయతీలలో చెత్త సంపద తయారీకేంద్రాలను డీఎల్‌పీవో రవీంద్రబాబు గురువారం తనిఖీ చేశారు. వర్మీకం పోస్టు తయారీ చేసి రైతులకు ఉపయోగపడేలా వాటిని అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. ప్రతి ఇంటి నుంచి తడి చెత్త, పొడిచెత్తలను సేకరించాలని ఆదేశించారు. ఆయనతోపాటు పంచాయతీ కార్యదర్శులు శేషారావు, లక్ష్మీప్రసన్న ఉన్నారు.

నేడు సదరన్‌రైల్వే డీఆర్ఎం పర్యటన

తడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : చెన్నై సదరన్ రైల్వే డీఆర్ఎం విశ్వనాథ్‌ఈర్యా గూడూరు సబ్ డివిజన్‌లో పర్యటించనున్నారు. ప్రత్యేక రైలులో గూడూరుకు వచ్చి అక్కడ తనిఖీల అనంతరం నాయుడుపేట, సూళ్లూరుపేట, తడలలో జరుగుతున్న పలు రైల్వే పనులను ఆయన పరిశీలించనున్నారు. సూళ్లూరుపేటలో ఉన్న ఎల్‌సీ నెంబరు 60, రైల్వేగేట్‌ను పరిశీలించి అక్కడ అండర్‌బ్రిడ్జి నిర్మాణస్థలాన్ని పరిశీలించనున్నారు. అక్కడ నుంచి ఆయన నేరుగా చెన్నైకు వెళ్లనున్నారు.

చిన్నారుల మెదడుకు పదును



మాట్లాడుతున్న సూపర్ వైజర్ కవిత

కోట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : పుట్టిన ప్రతి చిన్నారి మెదడుకు పదునుబెట్టి విధిగా అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని సీడీపీవో మునికుమారి, సూపర్ వైజర్లు కృష్ణమ్మ, కవిత అన్నారు. మండల పరిధిలోని చిట్టేడు, కోటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం అంగన్వాడీ వర్కర్లకు 'పోషణ్ బీ పడాయి బీ' శిక్షణ కార్యక్రమం జరిగింది. మూడు రోజులపాటు జరిగే ఈ శిక్షణ తరగతుల్లో తొలిరోజు అంగన్వాడీల కేంద్రాలలో బోధించే విద్య, సంపూర్ణ ఆరోగ్యం, తదితర అంశాలపై ఆయా వర్కర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయా అధికారులు మాట్లాడుతూ ప్రతిబిడ్డతోపాటు తల్లి ఆరోగ్యంగా ఉండాలని ఇందుకోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

రీసర్వేతో భూసమస్యల పరిష్కారం



రీసర్వేను పరిశీలిస్తున్న తహసీల్దారు చంద్రశేఖర్

గూడూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రీసర్వే కార్యక్రమం ద్వారా భూసమస్యలను పరిష్కరించుకునేందుకు వీలుంటుందని తహసీల్దారు చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని గొల్లపల్లి గ్రామంలో భూముల రీసర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే నిర్వహించే సమయంలో రైతులు అందుబాటులో ఉండి సర్వేకు సహకరించాలన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు.

రోడ్డు భద్రతపై ర్యాలీ



మానవహారం చేస్తున్న టీఎంఆర్ విద్యార్థులు

చిట్టమూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) : రోడ్డు భద్రత, రోడ్డు ప్రమాదాలపై గురువారం టీఎంఆర్ పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ చిన్న బలరామయ్య ఆధ్వర్యంలో టీఎంఆర్ విద్యా సంస్థ కరస్పాండెంట్ తంబిరెడ్డి మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ విజయలక్ష్మి, ఏఎస్ఐ నాగేశ్వరావు, ప్రిన్స్‌పాల్ రహంతుల్లా, మేనేజర్ ఆశ శ్రీనివాసులు, విద్యార్థులు కొత్తగుంటలో ర్యాలీ నిర్వహించి, మానవహారం చేపట్టారు.

సూళ్లూరుపేట, నాయుడుపేట మున్సిపాలిటీలకు

గ్రేడ్-2 హోదా ఎప్పుడో..?

ప్రతిపాదనలతో సరి ● మున్సిపాలిటీలుగా మారి 12 ఏళ్లయినా గ్రేడ్-3 హోదాలోనే ● కూటమి ప్రభుత్వం రావడంతో మళ్లీ చిగురించిన ఆశలు





సూళ్లూరుపేట, నాయుడుపేట మున్సిపల్ కార్యాలయాలు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట, నాయుడుపేట మున్సిపాలిటీలుగా అవతరించి పన్నెండేళ్లయింది. అయినా నేటికీ గ్రేడ్-3 హోదాలోనే ఉన్నాయి. గ్రేడ్-2గా మార్చేందుకు అన్ని హంగులున్నా కార్యరూపం దాల్చలేదు. ఈ రెండు మున్సిపాలిటీలు జాతీయ రహదారిని అనుకొని చెన్నై, నెల్లూరు నగరాలకు దగ్గరగా ఉండడంతో ఈ ప్రాంతాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందడడంతో పాటు రాబడి బాగా పెరిగింది. గ్రేడ్-2 మున్సిపాలిటీల స్థాయికి చేరాయి. ఆ మేరకు గ్రేడ్-2 పురపాలక సంఘాలుగా మార్పు చేయాలని గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆయా కౌన్సిళ్లు తీర్మానాలు చేశాయి. ఆ మేరకు ప్రభుత్వానికి 2023లోనే ప్రతిపాదనలు పంపారు. అయితే ఏళ్లు గడుస్తున్నా నేటికీ అమలుకాలేదు. కూటమి ప్రభుత్వం రావడంతో గ్రేడ్-2 హోదా వస్తుందని పట్టణ వాసులకు మళ్లీ ఆశలు చిగురించాయి.

మున్సిపాలిటీలుగా మారి పన్నెండేళ్లు..

సూళ్లూరుపేట, నాయుడుపేట మేజర్ పంచాయతీలను 2012 జనవరిలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం గ్రేడ్-3 మున్సిపాలిటీలుగా మార్పుచేసింది. ఆనాటి నుంచి రెండు ప్రాంతాల్లో మున్సిపాలిటీ పాలన ప్రారంభమైంది. అయితే అప్పటికీ, ఇప్పటికీ 12 ఏళ్లలో మున్సిపాలిటీ స్వరూపంలో భారీగా మార్పులు వచ్చాయి. రెండు మున్సిపాలిటీల్లో జనాభా సైతం పెరిగారు. రాబడి రూ.5 కోట్లకు పైగా దాటింది. భౌగోళిక విస్తీర్ణం పెరిగింది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని సూళ్లూరుపేట, నాయుడుపేట మున్సిపాలిటీలను గ్రేడ్-3 నుంచి గ్రేడ్-2గా మార్పు చేయాలంటూ కౌన్సిళ్లు తీర్మానం చేసి ప్రతిపాదనలు సీడీఎంఏ కార్యాలయానికి పంపాయి. పంపి రెండేళ్లయినా అతీగతీ లేదు. అన్ని హంగులున్న ఈ మున్సిపాలిటీలకు గ్రేడ్-2 హోదా తీసుకురావడంతో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టాల్సి ఉంది.

పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి..

రెండు మున్సిపాలిటీలు పారిశ్రామికంగా పరుగులు తీస్తున్నాయి. శ్రీసిటీ, మాంబట్టు పారిశ్రామిక వాడల్లోని పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు సూళ్లూరుపేటలో నివాసం ఉంటున్నారు. అదేవిధంగా మేనకూరులో పనిచేసే వారు నాయుడుపేటలో నివాసం ఉంటున్నారు. ప్రస్తుతం రెండు మున్సిపాలిటీలు గ్రేడ్-3 పరిధిలో ఉండడంతో అభివృద్ధికి నిధులు చాలడం లేదు. అదే గ్రేడ్-2 ఆమోదం పొందితే ప్రభుత్వ నిధుల కేటాయింపులు ఎక్కువగా ఉంటాయి. మౌలికవసతులకు పెద్దపీట వేయవచ్చు. ప్రస్తుతం కమిషనర్‌కు రూ.20 వేలు వరకు మాత్రమే పరిపాలన ఆమోదం ఉంది. జిల్లాల పునర్విభజన తర్వాత ఈ రెండు పట్టణాలు మరింత అభివృద్ధి చెందాయి. భూముల ధరలకు సైతం రెక్కలు వచ్చాయి.

గేడ్-2గా మార్పు చెందితే కలిగే ప్రయోజనాలు..

మున్సిపాలిటీలు గ్రేడ్-3 నుంచి గ్రేడ్-2కు మార్పు అయితే ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. జనాభా నిష్పత్తిని అనుసరించి నిధులు కేటాయింపు చేస్తారు. ప్రభుత్వం నుంచి పరిపాలన ఆమోదం మేరకు కమిషనర్‌కు రూ.50 వేలు వరకు ఉంటుంది. పనులు వేగవంతంగా జరుగుతాయి. ఉద్యోగుల సంఖ్య పెరుగుతుంది. కమిషనర్‌ను గ్రూపు-1 ఆఫీసర్లను నియమిస్తారు.

గ్రేడ్-2 మున్సిపాలిటీలకు అర్హతలు

- జనాభా 50 వేలకు పైగా ఉండాలి.
- ఆదాయం రూ.3 కోట్లు పైగా ఉండాలి.
- విస్తీర్ణం 20 చ.కి.మీలు ఉండాలి.
- ఇతర మౌలిక సదుపాయాలు తప్పని సరి

ప్రస్తుతం సూళ్లూరుపేట పరిస్థితి

- జనాభా 56 వేలు పైబడి ఉన్నారు.
- ఆదాయం సుమారు రూ.9 కోట్లు పైనే
- విస్తీర్ణం 21 చ.కిమీలు మేర ఉంది.

నాయుడుపేట పరిస్థితి

- జనాభా 55 వేలు
- ఆదాయం రూ.5 కోట్లు
- విస్తీర్ణం సుమారు 28 చ.కిమీలు.

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు భద్రత కల్పించాలి



గురుకులం వద్ద వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న హేమంత్, లక్ష్మీనారాయణ తదితరులు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పనబాక హేమంత్ కోరారు. అసోసి యేషన్ క్యాలెండర్‌ను ఎల్ఏసాగరంలోని గురుకులంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు ప్రభుత్వ రంగాలలో, గురు కులాలలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అప్కాస్ సిబ్బంది, ఏజెన్సీలలో ఉన్నటువంటి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ఆయా ప్రభుత్వ సంస్థలకు అప్పగిం చాలన్నారు. ఈ కార్యక్రమంలో గురుకులాల కాంట్రాక్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీ నారాయణ, జయశేఖర్, దేశయ్య, రత్నం, శ్యామ్, సాయి, సురేష్, రాజేష్, తదితరులు ఉన్నారు.

సంపద కేంద్రాల పరిశీలన



సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో రవీంద్రబాబు, పక్కనే ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు సతీష్ తదితరులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలంలోని ఇలుపూరు, మంగళంపాడు, దామానెల్లూరు గ్రామాల్లో ఉన్న సంపద కేంద్రాలను గురువారం డీఎల్‌పీవో సీహెచ్ రవీంద్ర బాబు పరిశీలించారు. ఇన్నాళ్లు నిరుపయోగంగా ఉన్న సంపద కేంద్రాలను మళ్లీ వినియోగంలోకి తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం చొరవతీసుకొంటుంది. ఈ నేపథ్యంలో డీఎల్‌పీవో ఆ కేంద్రాలను పరిశీలించి పంచాయతీ కార్యదర్శిలు, వీఆర్వోలకు సూచనలు ఇచ్చారు. గ్రామాల్లో తాగునీరు సరఫరా సక్రమంగా అందేలా చూడాలన్నారు. అదే విధంగా వీధి దీపాలు అన్ని చోట్ల వెలిగేలా చూడాల్సిన బాధ్యత కార్యదర్శిలదేనన్నారు. ఈ కార్యక్రమంలో మంగళంపాడు సర్పంచ్ తోట రుక్మిణి, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు టీడీపీ నాయకులు సతీష్, శేషాద్రి ఉన్నారు.

లారీ బోల్తా .. డ్రైవర్‌కు గాయాలు



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు లోని శ్రీపెరంబూదూరు నుంచి ఇనుప స్క్రాబ్ లోడుతో వెళ్తున్న లారీ సూళ్లూరుపేటలోని జాతీయ రహదారి వట్రపాలెం సమీపంలో గురువారం అదుపు తప్పి బోల్తాపడింది. డ్రైవర్ నడివేలుకు స్వల్పగాయాలయ్యాయి. బోల్తాపడిన లారీని హైవే అత్యవసర సిబ్బంది క్రేన్ తెప్పించి వెలికితీశారు.

రైలుఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ సమీపంలోని దక్షిణ వైపున గురువారం రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. మృతుడి ఎరుపు రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. సుమారు 45 సంవత్సరాలు వయస్సు ఉంటుంది. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రైల్వే జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసస్తున్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

గూడూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు పోషకవిలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చునని సీడీపీవో మోహబూబి అన్నారు. గురువారం స్థానిక జడ్పీ బాలికల ఉన్నతపాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 'పోషణ్ బీ పడాయ్ బీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు పోషకవిలువలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అంగన్వాడీ కార్యకర్తలపై ఉందన్నారు. పోషకవిలువలపై అవగాహన పెంపొందించేలా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కాంచన, మాధవిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరిటౌన్: పోషణ బీ పడాయి బీ శిక్షణా కార్యక్రమం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీడీపీవో షంషాద్ బేగం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బాబయ్య, విజయ శ్రీ, హెచ్ఎం వాణి తదితరులు పాల్గొన్నారు.

వాకాడు : మండలంలోని ఎఫ్ఏఎల్‌టీఈఎఫ్ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు ఐసీడీఎస్ సీడీపీవో సూపర్‌వైజర్ బుజ్జమ మూడు రోజుల శిక్షణలో భాగంగా తొలిరోజు శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఏఎల్‌సీఏఫ్ ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్న ఐసీడీఎస్ సూపర్ వైజర్ బుజ్జమ్మ

పరిశుభ్రత అందరి బాధ్యత

పెళ్లకూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల శుభ్రతతోనే అందరూ ఆరోగ్యంగా ఉంటారని ఆ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో ప్రమీలారాణి అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర -స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో ఆయన సమావేశమయ్యారు. కార్యదర్శి శ్రీహరి ఉన్నారు.

టీచర్‌పై డీఈవో విచారణ

ఓజిలి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముమ్మాయపాళెం ప్రాథమిక పాఠశాల (ఎస్టీ) ఉపాధ్యాయుడు శేఖర్‌పై గురువారం ఎంఈవో కార్యాలయంలో విచారణ జరిగింది. గూడూరు డిప్యూటీ డీఈవో సనత్‌కుమార్ విచారణలో చేపట్టారు. నాయుడుపేట మండలం మేనకూరుకు చెందిన ఉపాధ్యాయుడు శేఖర్‌కు అతని సోదరుడికి మధ్య ఆస్తి వివాదం ఉన్నది. దీంతో శేఖర్‌పై జిల్లా ఉన్నతాధి కారులకు అతని సోదరుడు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో కలెక్టర్ ఆదేశాలతో డిప్యూటీ డీఈవో విచారణ చేశారు. ఓజిలి ఎంఈవో శైలజ పాల్గొన్నారు.

మంత్రిని కలసిన టీడీపీ నేతలు



నాయుడుపేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను అమరావతిలో గురువారం తిరుపతి పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి, టీడీపీ నేతలు కందలకృష్ణారెడ్డి, కామిరెడ్డి అశోక్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతి పార్లమెంట్ పరిధిలో, సూళ్లూరుపేట నియోజకవర్గంలో గత భూసర్వేలోని అవకతవకలను మంత్రి దృష్టికి తీసుకు వెళ్లినట్లు వారు తెలిపారు. సకాలంలో రెవెన్యూ సమస్యలు పరిష్క రిస్తామని మంత్రి తెలియజేశారని వారు పేర్కొన్నారు.

ప్రతి శనివారం ప్రజా దర్బార్

వెంకటగిరిటౌన్, ఫిబ్రవరి(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతి శనివారం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించనుందని ఎంపీడీవో కోటేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ 15వ తేదీన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని వివరించారు.

తల్లి మందలించిందని విద్యార్థి పరార్

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): చదవడం లేదని తల్లి మందలించడంతో విద్యార్థి పరారైన ఘటన సింగాలగుంటలో గురువారం చోటు చేసుకుంది. సింగాలగుంటకు చెందిన సాయిశ్రీహరి పదో తరగతి చదు వుతు న్నాడు. పరీక్షలకు సరిగా ప్రిపేర్ కాకపోవడంతో తల్లి మందలించింది. మనస్తాపానికి గురైన శ్రీహరి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. అలిపిరి ఎస్ఐ నాగార్జున రెడ్డి కేసు దర్యాప్తు చేపట్టారు.

సరైన వసతులు లేక విద్యార్థుల అవస్థలు


గూడూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని నెల్లటూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో సరైన వసతులు లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఈ పాఠశాలలో సుమారు 140 మంది వరకు చదువుతున్నారు. ప్రహరీ కొంతమేర కూలిపోయింది. ఈ ప్రహరీ ఆనుకుని చిన్నపాటి చెరువు ఉండడంతో విద్యార్థులు ఆడుకునే సమయంలో ప్రమాదాలకు లోనవు తారోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మరుగుదొడ్ల నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ప్రస్తుతం ఉన్న మరుగుదొడ్లకు తలుపులు ధ్వంసమై అధ్వానంగా ఉన్నాయి. దీంతో విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారు. రెండో విడత నాడు- నేడు ద్వారా కొత్తగా మరుగుదొడ్ల నిర్మా ణాలు చేపట్టారు. అయితే నిధుల కొరత కారణంగా ఆరు నెలలకు పైగా ఈ నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఇక పశువులు సైతం క్రీడామైదానంలోకి వస్తుండడంతో ఆవరణం అపరి శుభ్రంగా మారింది. అలాగే తరగతిగదుల వెనుక వైపు చెట్లు ఎక్కువగా ఉండడంతో పాముల బెడద వేధిస్తోంది. ఇకనైనా అధికారులు స్పందించి కూలిపోయిన ప్రహరీని నిర్మించడంతో పాటు అసంపూర్తిగా నిలిచిపోయిన మరుగుదొడ్ల నిర్మాణాలను పూర్తిచేసి వినియోగంలోకి తీసుకు రావాలని విద్యార్థులు కోరుతున్నారు. పరిసరాలలోని చెట్లపొదలను తొలగించాలని కోరుతున్నారు.







దెబ్బతిని ఉన్న ప్రహరీ, చెట్లతో నిండిపోయిన తరగతిగది వెనుక ప్రదేశం ● ప్రస్తుత మరుగుదొడ్లకు పాడైపోయి ఉన్న తలుపు



అసంపూర్తిగా నిలిచిపోయిన మరుగుదొడ్ల నిర్మాణం